www.prajanaava.in

Telugu Daily

ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

Published from: **Hyderabad, Rangareddy, Karimnagar** Circulated to: **Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 79 | శుక్రవారం | 30 అక్టోబర్, 2026

కొనుగోళ్లతో కళకళ

7

- భారీ లాభాలతో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు
- దూసుకెళ్లిన సెన్సెక్స్, నిఫ్టీ



23.40 లక్షల ఎకరాల్లో

పంట నష్టం

15.88 లక్షల ఎకరాల్లో పత్తి..
4.79 లక్షల ఎకరాల్లో నష్టపోయిన వరి

- నాగర్ కర్నూల్, నల్లగొండలో అత్యధికంగా పంట నష్టం
- రూ.20వేల కోట్ల నష్టం అంచనా
- ప్రాథమిక నివేదిక సిద్ధం చేసిన సర్కారు
- త్వరలో కేంద్రానికి నివేదిక

ప్రజానావ, హైదరాబాద్: ఎల్‌నినో ప్రభావంతో మారిన వాతావరణ పరిస్థితులు తెలంగాణ రైతాంగాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. వర్షాభావ పరిస్థితులు, పంటల ఎదుగుదల దశలో తేమ లోపం, అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 23.40 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనాలు రూపొందించింది. ఇందులో అత్యధికంగా 15.88 లక్షల ఎకరాల్లో పత్తి పంట నష్టపోయినట్లు గుర్తించింది. వరి, కంది, మొక్కజొన్నతోపాటు ఇతర పంటలకూ నష్టం వాటిల్లినట్లు నివేదికలో పేర్కొంది. పంట నష్టంపై వ్యవసాయ శాఖ రూపొందించిన ప్రాథమిక నివేదికను విపత్తుల నిర్వహణ శాఖకు అందించినట్లు సమాచారం. ఈ వివరాలను క్రోడీకరించి కేంద్ర ప్రభుత్వానికి పంపేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

పత్తి రైతులపై తీవ్ర ప్రభావం

రాష్ట్రంలో పత్తి సాగు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పంట నష్టం తీవ్రత ఆందోళన కలిగిస్తోంది. ప్రాథమిక అంచనాల ప్రకారం 15.88 లక్షల ఎకరాల్లో పత్తి పంట దెబ్బతిన్నది. మొత్తం పంట నష్టంలో పత్తి వాటానే సింహభాగంగా ఉంది. పత్తి సాగు కోసం విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చుల రూపంలో రైతులు ఇప్పటికే పెట్టుబడులు పెట్టారు. పంట చేతికొచ్చే దశలో ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురుకావడంతో పెట్టుబడులు తిరిగి వస్తాయా లేదా అన్న ఆందోళన నెలకొంది. పత్తి తర్వాత వరి పంటకు కూడా గణనీయమైన నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అంచనాలు వెల్లడిస్తున్నాయి. 4.79 లక్షల ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనాల్లో పేర్కొన్నారు. కంది పంట 1.58 లక్షల ఎకరాల్లో, మొక్కజొన్న 70 వేల ఎకరాల్లో నష్టపోయినట్లు గుర్తించారు. మిరప పంటకు 14 వేల ఎకరాల్లో, ఇతర పంటలకు 31 వేల ఎకరాల్లో నష్టం జరిగినట్లు అంచనా వేశారు. మొత్తంగా అన్ని పంటలు కలిపి 23.40 లక్షల ఎకరాల్లో నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి.

నాగర్ కర్నూల్‌లో అత్యధికం

జిల్లాల వారీగా చూస్తే నాగర్‌కర్నూల్ జిల్లాలో అత్యధికంగా 4.70 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనాలు సూచిస్తున్నాయి. ఆ తర్వాత నల్లగొండలో 3.58 లక్షల ఎకరాలు, నారాయణపేటలో తరువాయి 2లో..



భారత్‌కు సూపర్ ఎల్‌నినో ముప్పు



- దాదాపు 55వేల మరణాల అంచనా
- డిసెంబర్‌లో గరిష్ఠస్థాయికి చేరే అవకాశం
- 2027 ఆరంభం వరకు తీవ్ర వాతావరణ ప్రభావాలు
- వృద్ధులు, చిన్నారులు అప్రమత్తంగా ఉండాలంటున్న నిపుణులు

6



నేడు గుజరాత్‌కు మోడీ

- రూ.14వేల కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం
- పీఎం–కిసాన్ పథకం 24వ విడతగా రూ.19 వేల కోట్లను విడుదల చేయనున్న ప్రధాని

2

మల్లన్న సాగర్‌ను కూల్చివేసే కుట్ర

- రిజర్వాయర్ వద్ద పేలుళ్లపై హరీశ్‌రావు ఆగ్రహం
- చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌కు లేఖ



సిద్దిపేట జిల్లాలోని ప్రసిద్ధ మల్లన్నసాగర్ రిజర్వాయర్ కట్ట సమీపంలో జరుగుతున్న అక్రమ బ్లాస్టింగ్ పనులపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తిప్పారం గ్రామం వద్ద రిజర్వాయర్ కట్టకు అతి సమీపంలో అనధికారికంగా బ్లాస్టింగ్ పనులు నిర్వహిస్తుండటాన్ని ఆయన స్వయంగా పరిశీలించి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కట్ట పక్కనే నిబంధనలకు విరుద్ధంగా కేవలం 200 మీటర్ల దూరంలోనే ఈ విధమైన బ్లాస్టింగ్ లు జరపడం వల్ల మల్లన్నసాగర్ ప్రాజెక్ట్ ప్రమాదంలో పడే అవకాశం ఉందని హెచ్చరించారు.

2

ఆ స్థలాలు ప్రభుత్వానివే

మియాపూర్ భూములపై సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు
23ఏళ్ల న్యాయపోరాటానికి తెర
ప్రైవేట్ వ్యక్తుల అప్పీళ్లు కొట్టివేసిన అత్యున్నత న్యాయస్థానం



హైదరాబాద్ నగర శివార్లలో అత్యంత విలువైన మియాపూర్ భూములపై దశాబ్దాలుగా సాగుతున్న సుదీర్ఘ భూవివాదానికి సుప్రీంకోర్టు శాశ్వత ముగింపు పలికింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 100, 101లలో ఉన్న 550 ఎకరాలకు పైగా భూమి పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానిదేనని సుప్రీంకోర్టు స్పష్టం చేస్తూ గురువారం చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. ఈ భూములపై యాజమాన్య హక్కులు కోరుతూ బండారి రామచందర్, పార్థసారథి, సువిశాల్ జైన్ తదితర ప్రైవేట్ వ్యక్తులు దాఖలు చేసిన దాదాపు 20 సివిల్ అప్పీళ్లు, ఎస్ఎల్పీలను సుప్రీంకోర్టు కొట్టివేసింది. గత 23 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ వివాదంలో 2003 నాటి ఉమ్మడి హైకోర్టు తీర్పును అత్యున్నత న్యాయస్థానం సమర్థించింది.

ప్రజానావ, హైదరాబాద్:

హైదరాబాద్ నగర శివార్లలో అత్యంత విలువైన మియాపూర్ భూముల పై దశాబ్దాలుగా సాగుతున్న సుదీర్ఘ భూవివాదానికి సుప్రీంకోర్టు శాశ్వత ముగింపు పలికింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 100, 101లలో ఉన్న 550 ఎకరాలకు పైగా భూమి పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానిదేనని సుప్రీంకోర్టు స్పష్టం చేస్తూ గురువారం చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. ఈ భూములపై యాజమాన్య హక్కులు కోరుతూ బండారి రామచందర్, పార్థసారథి, సువిశాల్ జైన్ తదితర ప్రైవేట్ వ్యక్తులు దాఖలు చేసిన దాదాపు 20 సివిల్ అప్పీళ్లు, ఎస్ఎల్పీలను సుప్రీంకోర్టు కొట్టివేసింది. గత 23 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ వివాదంలో 2003 నాటి ఉమ్మడి హైకోర్టు తీర్పును అత్యున్నత న్యాయస్థానం సమర్థించింది. కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తులు ప్రైవేట్ వ్యక్తుల పరమయ్యేందుకు అనుమతించబోమని, ఇటువంటి వ్యవహారాల్లో న్యాయస్థానం మౌనంగా ఉండలేదని పేర్కొంది. ప్రభుత్వ భూమి పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం చూపిన ప్రత్యేక చొరవను ధర్మాసనం ప్రశంసించింది.

అంతమాత్రాన హక్కులు సంక్రమించవు

జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ సతీశ్ చంద్రశర్మలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రైవేట్ వ్యక్తుల వాదనలను తోసిపుచ్చింది. 1912 నాటి సర్వే రికార్డుల ప్రకారమే ఈ స్థలాలు సర్కారీ పోరంబోకు భూముల పరిధిలోకి వస్తాయని ధర్మాసనం స్పష్టం చేసింది. 1949 నాటి జాగీర్ల రద్దు చట్టం అమలుతోనే ఈ భూములు రాష్ట్ర ప్రభుత్వ పరమయ్యాయని, అప్పట్లోనే సంబంధిత జాగీర్దార్లు పరిహారం కూడా పొందారని కోర్టు గుర్తుచేసింది. జాగీర్ హక్కులు ఉన్నంత మాత్రాన భూమిపై శాశ్వత యాజమాన్య హక్కులు సంక్రమించవని తేల్చిచెప్పింది. జాగీర్దార్ కైసరుద్దీన్ చట్టబద్ధ వారసులైన అమీరున్నిషా తదితరుల నుంచి తాము చట్టబద్ధంగా పొందామని, ఇరిపోకబుల్ జీపీఏ, సనద్ హక్కులకు భంగం కలగకుండా చూడాలని పిటిషనర్లు కోరగా, రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై పహాణీల్లో పేర్లు నమోదు చేసుకున్నంత మాత్రాన యాజమాన్య హక్కులు రావని కోర్టు వ్యాఖ్యానించింది. వారు సమర్పించిన పత్రాలన్నీ నకిలీవేనని, అప్పీలుదారులు తమ హక్కులను నిరూపించడంలో విఫలమయ్యారని, వారు ఎలాంటి పరిహారానికి కూడా అర్హులు కారని తీర్పులో తేల్చింది.

రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా..

మియాపూర్‌లోని సర్వే నంబర్ 100లో 277 ఎకరాల 5 గుంటలు, సర్వే నంబర్ 101లో 273 ఎకరాల 34 గుంటలు.. మొత్తం 550 ఎకరాలకు పైగా విస్తీర్ణం రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా నమోదై ఉంది. ఈ వివాదం మూడు దశాబ్దాలుగా న్యాయస్థానాల్లో కొనసాగుతోంది. ఈ భూములపై హక్కులు క్లెయిమ్ చేస్తూ ప్రైవేట్ వ్యక్తులు ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్, 1982 కింద ఏర్పాటైన ప్రత్యేక కోర్టులో ఎల్జీసీ నం. 131/95, 136/95 కింద కేసులు వేశారు. విచారణ చేపట్టిన ప్రత్యేక తరువాయి 2లో..

హామీలు, గ్యారెంటీలకు హాలిడే

- రైతులను గాలికొదిలేసి సెల్ఫ్ డిక్లరేషన్ల పేరుతో కాంగ్రెస్ కొత్త నాటకం
- మూసీ సుందరీకరణకు అన్ని నిధులెందుకు?
- ఎలాంటి సమ్మిట్లు పెట్టకుండానే లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాం
- విదేశీ పర్యటనలు, పెట్టుబడులు, ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- ముందుగా నీళ్లు ఎత్తిపోసుకోవడంతో ఏపీలో కరువు, క్రాప్ హాలిడే లేవు: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ప్రజానావ, హైదరాబాద్: ఎన్నికల ముందు 420 హామీలు, ఆరు గ్యారెంటీలు ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటికి హాలిడే ప్రకటించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. అన్ని రంగాలకు హాలిడే ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే హాలిడే ఇస్తే రాష్ట్రానికి పట్టిన దరిద్రం పోతుందని వ్యాఖ్యానించారు. ఎన్నికల ముందు రైతు డిక్లరేషన్లు ప్రకటించిన కాంగ్రెస్.. ఇప్పుడు రైతుల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్లు తీసుకుంటోందని మండిపడ్డారు. తమ పంటలను తామే కాపాడుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని, కరెంట్ కోతలు, సాగు నీటి కొరతతో జెనరేటర్లు, ట్యాంకర్లపై రైతులు ఆధారపడాల్సి వస్తోందన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులకు ప్రకృతి కారణం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే కారణమని కేటీఆర్ ఆరోపించారు. రైతుబంధు నిధులను పూర్తిస్థాయిలో విడుదల చేయాలని, రైతు బీమా సహా సంక్షేమ పథకాలను అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పంటలు ఎండిపోతుంటే ప్రభుత్వం పట్టించుకోకుండా ప్రచార కార్యక్రమాలకు ప్రాధాన్యమిస్తోందని విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజీ సమస్యల పరిష్కారంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో తాగు, సాగునీటి కష్టాలు నెలకొన్న సమయంలో మూసీ సుందరీకరణకు రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం ఎంతవరకు సమంజసమని కేటీఆర్ ప్రశ్నించారు. సరైన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) లేకుండానే ఈ ప్రాజెక్టు పేరుతో దోపిడీకి తెరలేపారని ఆరోపించారు. మూసీ ప్రాజెక్టును వెంటనే నిలిపివేసి, ఆ నిధులను రైతుల ఉపశమనానికి, ప్రజా సంక్షేమానికి వినియోగించాలని కోరారు. కరెంట్ కోతలతో పరిశ్రమలు ఇబ్బందులు పడుతున్నాయని, పవర్ హాలిడేల వల్ల పారిశ్రామిక రంగానికి నష్టం జరుగుతోందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. 'కాంగ్రెస్ ఉంటే కరెంట్ ఉండదు.. కరెంట్ ఉంటే కాంగ్రెస్ ఉండదు' తరువాయి 2లో..





లాఠీలకు భయపడొద్దు

- రామ్‌లీలా మార్చ్‌కు రాహుల్ పిలుపు
- నవంబర్ 1న 'ఓటు చోరీ'కి వ్యతిరేకంగా ఇండియా కూటమి నిరసన

2



పెట్టుబడులకు నేనే సంరక్షకుడిని

- తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి.. వృద్ధిని రెట్టింపు చేసుకోండి
- భద్రత, ప్రభుత్వ సహకారం నాది
- అడ్డంకుల తొలగింపు బాధ్యతా నాదే
- పారిశ్రామికవేత్తలకు సీఎం రేవంత్‌రెడ్డి భరోసా
- డిసెంబరు 7, 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్

2

23.40 లక్షల ఎకరాల్లో పంట నష్టం

(మొదటిపేజీ తరువాయి)

2.40 లక్షల ఎకరాలు, సంగారెడ్డిలో 2.19 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. జనగామ, గద్వాల, రంగారెడ్డి జిల్లాల్లో నష్టం గణనీయంగా ఉంది.

త్వరలో కేంద్రానికి నివేదిక

పంట నష్టం తీవ్రత నేపథ్యంలో రైతులకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరమని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఎల్ నినో కారణంగా సుమారు రూ.20 వేల కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అంచనా వేసి, కేంద్రం నుంచి ప్రత్యేక సహాయం అందించాలని ఇప్పటికే శాసనసభ తీర్మానం ద్వారా కోరింది. ఇప్పుడు వ్యవసాయ శాఖ రూపొందించిన తాజా ప్రాథమిక నివేదికను విపత్తుల నిర్వహణ శాఖ ద్వారా కేంద్రానికి పంపే ప్రక్రియ చేపట్టనున్నట్లు సమాచారం. రాష్ట్రం పంపిన నివేదికను పరిశీలించిన అనంతరం కేంద్ర బృందం తెలంగాణలో పంట నష్టం జరిగిన ప్రాంతాలను సందర్శించే అవకాశం ఉంది. క్షేత్రస్థాయి పరిశీలన, నష్టం అంచనాల ఆధారంగా కేంద్ర సాయంపై స్పష్టత రానుంది. మరోవైపు, పంటలు పూర్తిగా లేదా పాక్షికంగా దెబ్బతిన్న రైతులను గుర్తించి సకాలంలో పరిహారం అందించడం కీలకంగా మారింది.

ఆ స్థలాలు ప్రభుత్వానివే

(మొదటిపేజీ తరువాయి)

కోర్టు 1997 డిసెంబర్ 12న తీర్పునిస్తూ, సదరు ప్రైవేట్ వ్యక్తులను భూ కబ్జాదారులుగా నిర్ధారించింది. వివాదాస్పద భూములను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించింది. ప్రత్యేక కోర్టు తీర్పును సవాలు చేస్తూ ప్రైవేట్ వ్యక్తులు అప్పటి ఏపీ హైకోర్టులో రిట్ పిటిషన్ నం. 889/98తో పాటు పలు వ్యాజ్యాలు వేశారు. అప్పట్లో జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ) రిజిస్ట్రేషన్లను రద్దు చేస్తూ శేరిలింగంపల్లి మండల తహసీల్దార్ తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తూ.. 2003 ఏప్రిల్ 16న హైకోర్టు మొత్తం 10 రిట్ పిటిషన్లను కొట్టివేసింది. అనంతరం ఈ భూములను హుడా/హెచ్ఎండీఏలకు అప్పగించింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సదరు వ్యక్తులు సుప్రీంకోర్టులో ఎస్ఎల్పీ నం. 14917/2003తో పాటు మరో 19 పిటిషన్లు (మొత్తం 20 కేసులు) దాఖలు చేశారు. ఇవి గత 23 ఏళ్లుగా సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి.

హామీలు, గ్యారెంటీలకు హాలిడే

(మొదటిపేజీ తరువాయి)

అన్న పరిస్థితి నెలకొందని వ్యాఖ్యానించారు. రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించలేని ప్రభుత్వం పరిశ్రమలకు కూడా విద్యుత్ సరఫరా చేయలేకపోతోందని విమర్శించారు.

గ్లోబల్ సమ్మిట్ కాదు.. గోబెల్స్ సమ్మిట్

రాష్ట్రం కరువు, విద్యుత్ కోతలతో సతమతమవుతుంటే గ్లోబల్ సమ్మిట్ పేరుతో ప్రచార ఆర్భాటాలకు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. గతంలో నిర్వహించిన సమ్మిట్ ద్వారా ఒక్క పెట్టుబడి, ఒక్క ఉద్యోగం కూడా రాలేదని ఆరోపిస్తూ దాన్ని 'గోబెల్స్ సమ్మిట్'గా అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్త పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనపై స్పష్టమైన వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. గతంలో తమ ప్రభుత్వం పదేళ్లలో గ్లోబల్ సమ్మిట్లు నిర్వహించకుండానే లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లలో నిర్వహించిన విదేశీ పర్యటనలు, కుదుర్చుకున్న ఒప్పందాలు (ఎంఓయూలు), వాస్తవంగా వచ్చిన పెట్టుబడులు, కల్పించిన ఉద్యోగాల వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

చంద్రబాబుకు అభినందనలు

'తెలంగాణ కంటే తక్కువ వర్షపాతం ఉన్నా ఏపీలో కరువు లేదు. చంద్రబాబు ముందు చూపుతో నీళ్లు ఎత్తిపోసుకున్నారు. నీళ్లు ఎత్తిపోసుకోవడం వల్లే ఏపీలో కరువు, క్రాప్‌హాలిడే లేవు. ఈ విషయంలో చంద్రబాబును అభినందిస్తున్నాను' అని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో లోటు వర్షపాతం 17 నుంచి 20 శాతం మాత్రమే ఉందని, సీఎం రేవంత్ వల్లే రాష్ట్రంలో కరువు వచ్చిందన్నారు. కొండా సురేఖ ట్వీట్ పై స్పందిస్తూ... మాజీ మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు ఇంకా చూడలేదని, చూశాక లీగల్ టీమ్‌తో చర్చిస్తానని చెప్పారు. 'నిజం నిలకడ మీద తేలుతుందని పెద్దలు ఎప్పుడో చెప్పారు.. ఇంకా క్షమాపణలు చెప్పేవాళ్లు చాలా మంది ఉన్నారు' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. తనపై వచ్చిన ఆరోపణలన్నీ దూది పింజల్లా తేలిపోతాయన్నారు.

మల్లన్న సాగర్‌ను కూల్చివేసే కుట్ర

ప్రజానావ, సిద్దిపేట: సిద్దిపేట జిల్లాలోని ప్రసిద్ధ మల్లన్నసాగర్ రిజర్వాయర్ కట్ట సమీపంలో జరుగుతున్న అక్రమ బ్లాస్టింగ్ పనులపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తిప్పారం గ్రామం వద్ద రిజర్వాయర్ కట్టకు అతి సమీపంలో అనధికారికంగా బ్లాస్టింగ్ పనులు నిర్వహిస్తుండటాన్ని ఆయన స్వయంగా పరిశీలించి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కట్ట పక్కనే నిబంధనలకు విరుద్ధంగా కేవలం 200 మీటర్ల దూరంలోనే ఈ విధమైన బ్లాస్టింగ్‌లు జరపడం వల్ల మల్లన్నసాగర్ ప్రాజెక్ట్ ప్రమాదంలో పడే అవకాశం ఉందని హెచ్చరించారు. మేడిగడ్డను చేసినట్లే ఈ ప్రాజెక్ట్‌ను కూడా కూల్చివేయాలని కుట్ర చేస్తున్నారా? అంటూ ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు. ప్రాజెక్ట్ భద్రతను పణంగా పెట్టి ఇలాంటి కుట్రలకు పాల్పడితే చూస్తూ ఊరుకోబోమని, ప్రభుత్వం వెంటనే స్పందించి కట్ట వద్ద జరుగుతున్న బ్లాస్టింగ్ పనులను బేషరతుగా నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి హరీశ్‌రావు లేఖ రాశారు. నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా బ్లాస్టింగ్ చేపడుతున్న ఏజెన్సీ నిర్వాహకులపై తక్షణమే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని లేఖలో స్పష్టం చేశారు. ప్రాజెక్టులకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని మండిపడిన ఆయన, ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని తీవ్రంగా హెచ్చరించారు.

పెట్టుబడులకు నేనే సంరక్షకుడిని

న్యూఢిల్లీ: తెలంగాణలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం పూర్తి అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. పెట్టుబడుల భద్రత, వృద్ధికి అవసరమైన విధానపరమైన నిర్ణయాలు, ప్రభుత్వ సహకారం అందించే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలనుకునే పారిశ్రామికవేత్తలు తమ ప్రణాళికలను మరింత విస్తరించుకోవాలని, ఆశించిన పెట్టుబడులు, వృద్ధి లక్ష్యాలను రెట్టింపు చేసుకోవాలని పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులకు సంరక్షకుడిగా వ్యవహరిస్తానని ప్రకటించారు. న్యూఢిల్లీలో గురువారం నిర్వహించిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026' సన్నాహక కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. డిసెంబరు 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న గ్లోబల్ సమ్మిట్‌కు పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, వివిధ దేశాల దౌత్య కార్యాలయాల ప్రతినిధులు, భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. 'తెలంగాణలో ఎంత పెట్టుబడి పెట్టాలనుకుంటున్నారో ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకుని, ఆ మొత్తాన్ని రెట్టింపు చేయండి. ఆశిస్తున్న వృద్ధి రేటు, లాభాల లక్ష్యాలనూ పెంచుకోండి. అందుకు ప్రభుత్వం నుంచి ఏం కావాలో చెప్పండి. మీ పెట్టుబడులకు భద్రత కల్పించడం, అవి వృద్ధి చెందేలా చూడటం నా వ్యక్తిగత బాధ్యత. మీ పెట్టుబడులకు సంరక్షకుడిగా ఉంటా' అని రేవంత్‌రెడ్డి పారిశ్రామికవేత్తలకు హామీ ఇచ్చారు. వ్యాపార రంగంలో పారిశ్రామికవేత్తలకు తనకంటే ఎక్కువ అనుభవం, అవగాహన ఉంటాయని పేర్కొన్నారు. వారి అభిప్రాయాలను తెలుసుకోవడం, సూచనలను స్వీకరించడం, వాటిని ఆచరణలో పెట్టడం ద్వారా పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని మరింత మెరుగుపరుస్తామని చెప్పారు. పారిశ్రామిక అవకాశాలను విస్తరించడం, పెట్టుబడిదారులు ఎదుర్కొనే అడ్డంకులను తొలగించడం ప్రభుత్వ బాధ్యత అని వివరించారు.

2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం

'వికసిత్ భారత్–2047' లక్ష్యానికి అనుగుణంగా 'తెలంగాణ రైజింగ్–2047' ప్రణాళికను రూపొందించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. 2034 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ డాలర్ల స్థాయికి, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేర్చడమే లక్ష్యమన్నారు. 2047 నాటికి భారత్ 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగితే, అందులో తెలంగాణ వాటా పది శాతంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం దేశ జీడీపీలో రాష్ట్ర వాటా ఐదు శాతంగా ఉందని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధికి పారిశ్రామికవేత్తలు తమ ఆలోచనలు, విధానపరమైన సూచనలు అందించాలని కోరారు. వాటిని పరిశీలించి, ఆచరణ సాధ్యమైన ప్రతిపాదనలను ప్రభుత్వ విధానాల్లో భాగం చేస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రగతి ప్రస్థానంలో పరిశ్రమల రంగం భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.



మౌలిక సదుపాయాల విస్తరణ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సత్సంబంధాలు ఉన్నాయని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కేంద్రం ప్రతిపాదించిన ఏడు హైస్పీడ్ రైలు కారిడార్లలో మూడు హైదరాబాద్‌ను అనుసంధానించనున్నాయని తెలిపారు. హైదరాబాద్–చెన్నై, హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–పుణె మార్గాల్లో ఈ కారిడార్లు ఏర్పాటు కానున్నాయని వివరించారు. వరంగల్, ఆదిలాబాద్‌లలో కొత్త విమానాశ్రయాల నిర్మాణం సహా పలు అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్రం సహకరిస్తోందన్నారు. ప్రాంతీయ రింగ్ రోడ్డు, మెట్రో రైలు విస్తరణ, నేవీ రాడార్ కేంద్రం వంటి ప్రాజెక్టులను ప్రస్తావించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధితో రాష్ట్రంలో పారిశ్రామిక, వాణిజ్య అవకాశాలు మరింత విస్తరిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రపంచ నగరాలతో పోటీ పడేలా..

హైదరాబాద్ చారిత్రక వైభవం, మౌలిక సదుపాయాలు, మేధోసంపత్తి రాష్ట్రానికి ప్రధాన బలాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. న్యూయార్క్, లండన్, టోక్యో, సియోల్, దుబాయ్ వంటి ప్రపంచ నగరాలతో హైదరాబాద్ పోటీపడే స్థాయికి ఎదగాలన్నది తమ లక్ష్యమని తెలిపారు. పెట్టుబడులకు అనుకూల విధానాలు, పారిశ్రామిక అభివృద్ధి, మెరుగైన మౌలిక సదుపాయాలతో ఈ లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, డాక్టర్ వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఐఐ తెలంగాణ చైర్మన్ ఎం. గౌతమ్‌రెడ్డి, సీఐఐ అధ్యక్షుడిగా నియమితులైన భారత్ బయోటెక్ ఎండీ సుచిత్రా కె. ఎల్లా, పలువురు ప్రజాప్రతినిధులు, పారిశ్రామిక ప్రముఖులు పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవస్థకు 2026 కీలక మలుపు



- 1991 నాటి పరిస్థితులను పోలిన ప్రస్తుత పరిణామాలు
- అప్పటిలా లావాదేవీల సంక్షోభం లేదు
- సరఫరా అంతరాయాలతో వృద్ధికి సవాళ్లు
- భవిష్యత్తు ఆర్థిక వ్యూహాలపై పునరాలోచన అవసరం: సీఈఏ

న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థకు 2026 కీలక మలుపుగా నిలవవచ్చని కేంద్ర ప్రధాన ఆర్థిక సలహాదారు వీ.అనంత నాగేశ్వరన్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుత పరిణామాలు 1991 నాటి పరిస్థితులను పోలి ఉన్నప్పటికీ, అప్పటిలా ఆర్థిక లావాదేవీల సంక్షోభం లేదని స్పష్టం చేశారు. అంతర్జాతీయ అనిశ్చితులతో పాటు తయారీ, ఇంధనం, వ్యవసాయం, సాంకేతిక రంగాల్లోని నిర్మాణాత్మక పరిమితులు వృద్ధికి సవాళ్ల విసురుతున్నాయని తెలిపారు. గురువారం జరిగిన ఐఏసీఐడీ–ఐడీఆర్‌పీ జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. 1991లో పేరుకుపోయిన ఆర్థిక పరిమితులు సంక్షోభానికి దారితీసి, విధానాల్లో కీలక మార్పులకు కారణమయ్యాయని గుర్తుచేశారు. ప్రస్తుతం కూడా భవిష్యత్తు వృద్ధి వ్యూహాలను సమూలంగా సమీక్షించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితులు ఉన్నప్పటికీ భారత్ స్థూల ఆర్థిక స్థిరత్వాన్ని, సంక్షోభాలను తట్టుకునే సామర్థ్యాన్ని ప్రదర్శిస్తోందన్నారు. ప్రకృతి వైపరీత్యాలే కాకుండా, దేశాలు ఉద్దేశపూర్వకంగా తీసుకునే నిర్ణయాలూ ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీస్తున్నాయని నాగేశ్వరన్ చెప్పారు. చైనా టన్నెల్ బోరింగ్ యంత్రాలు సహా మౌలిక సదుపాయాల ఉత్పత్తుల ఎగుమతులకు లైసెన్సింగ్ విధానాన్ని ఉదాహరణగా ప్రస్తావించారు. సరఫరాలపై ఆధిపత్యాన్ని ఆయుధంగా ఉపయోగిస్తే ఇతర దేశాలు ప్రత్యామ్నాయ ఉత్పత్తిని వెంటనే పెంచలేవని, అప్పటివరకు ఆంక్షల ప్రభావం తీవ్రంగా ఉంటుందని వివరించారు.

ద్రవ్య విధానానికి కొత్త సవాళ్లు

కరోనా ముందు దశాబ్దాల్లో 1987 స్టాక్ మార్కెట్ పతనం, 1997–98 తూర్పు ఆసియా సంక్షోభం, 2001 సాంకేతిక రంగ సంక్షోభం, 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభం వంటి పరిణామాలు ప్రధానంగా డిమాండ్ కొరతతో ముడిపడి ఉన్నాయని తెలిపారు. వాటిని ఎదుర్కొనేందుకు వడ్డీ రేట్ల తగ్గింపు, ఆర్థిక ఉద్దీపనలు, ద్రవ్య సరఫరా పెంపు వంటి చర్యలు చేపట్టారని గుర్తుచేశారు.

అయితే రానున్న 20–30 ఏళ్లలో సరఫరా కొరతలు ప్రధాన సవాలుగా మారవచ్చని చెప్పారు. డిమాండ్ తగ్గినప్పుడు ఉద్దీపనలతో వృద్ధిని పెంచవచ్చని, కానీ ఉత్పత్తి కొరతలను అలా పరిష్కరించలేమని పేర్కొన్నారు. సరఫరా అంతరాయాలు ఉత్పత్తిని దెబ్బతీయడంతోపాటు ద్రవ్యోల్బణాన్ని పెంచుతాయని హెచ్చరించారు. వడ్డీ రేట్ల పెంపుతో అధిక డిమాండ్‌ను నియంత్రించవచ్చని, ఉత్పత్తి కొరతలను మాత్రం ఆర్థిక విధానాలతోనే అధిగమించడం కష్టమని తెలిపారు. ప్రైవేటు పెట్టుబడులు, వ్యాపారాల చొరవ బలహీనపడినప్పుడు ప్రభుత్వ వ్యయాలతో ఉద్దీపన ఇవ్వడం సాధ్యమేనని, అయితే సరఫరా వైపు పరిమితులకు దీర్ఘకాలిక పరిష్కారాలు అవసరమని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో రానున్న మూడు దశాబ్దాల్లో ద్రవ్య విధానాల అమలు మరింత క్లిష్టంగా మారనుందని పేర్కొన్నారు.

హసీనా సర్కార్ కూల్చివేతకు ముందే కుట్ర

- సంచలన నిజాలు వెల్లడించిన మహమ్మద్ యూనస్ మాజీ సహాయకుడు



ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా పదవి నుంచి దిగిపోవడానికి కేవలం రెండు రోజుల ముందే ఆమె ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు కుట్ర పన్నినట్లు మహమ్మద్ యూనస్ మాజీ ప్రెస్ సెక్రటరీ షఫీకుల్ ఆలం సంచలన నిజాలు వెల్లడించారు. 2024 ఆగస్టు 5న హసీనా దేశం విడిచి పారిపోవడానికి ముందే, తాత్కాలిక ప్రభుత్వాన్ని నడిపించడానికి నోబెల్ గ్రహీత మహమ్మద్ యూనస్‌ను ఎంపిక చేసినట్లు ఆయన ఫేస్‌బుక్ పోస్ట్‌లో పేర్కొన్నారు. యూనస్, విద్యార్థి నేతల మధ్య ఒక అంతర్జాతీయ వార్తా సంస్థకు చెందిన జర్నలిస్ట్ వారధిగా నిలిచి ఈ రహస్య ఆపరేషన్‌ను నడిపించారని ఆలం తెలిపారు. హసీనా ప్రభుత్వ అణచివేత యంత్రాంగానికి కనీసం పసిగట్టకుండా అత్యంత గోప్యంగా ఈ ప్రణాళిక అమలు జరిగిందని ఆయన పేర్కొన్నారు. హసీనా ప్రభుత్వం పతనమైన తర్వాత యూనస్ తాత్కాలిక ప్రభుత్వ బాధ్యతలు చేపట్టగా, ఆ తర్వాత ప్రత్యేక ట్రిబ్యునల్ హసీనాకు మరణశిక్ష విధించడంతో పాటు అవామీ లీగ్ పార్టీని రద్దు చేసిన విషయం తెలిసిందే. అయితే తనపై, తన పార్టీ సభ్యులపై రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని యూనస్ ప్రభుత్వాన్ని హసీనా తీవ్రంగా ఆరోపించారు. ఇటీవల యూనస్ అమెరికా పర్యటన సందర్భంగా న్యూయార్క్ విమానాశ్రయంలో అవామీ లీగ్ మద్దతుదారులు ఆయనకు వ్యతిరేకంగా నిరసనలు తెలిపి 'హత్యకుడు' అంటూ నినాదాలు చేయడం రాజకీయంగా కలకలం రేపింది.

డిజిటల్ మోసాల భారాన్ని బ్యాంకులే భరించాలి

- నిర్లక్ష్యం నిర్ధారణైతే బాధితులకు నష్టపరిహారం
- డబ్బు మాయమయ్యాక కాదు.. ముందే అప్రమత్తం కావాలి
- ఆర్‌బీఐ నిబంధనల్లో బాధ్యతలు స్పష్టంగా ఉండాలి: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: బ్యాంకుల నిర్లక్ష్యం కారణంగా డిజిటల్ మోసాలు జరిగితే బాధితులకు నష్టపరిహారం చెల్లించేలా నిబంధనలు రూపొందించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బ్యాంకుల అప్రమత్తతలో లోపాలే మోసానికి కారణమని తేలితే, బాధితులు కోల్పోయిన మొత్తానికి తగ్గకుండా పరిహారం అందించాలని సూచించింది. ఈ ఏడాది ఇప్పటివరకు సైబర్ మోసాల్లో బాధితులు రూ.800 కోట్లు నష్టపోయారని ధర్మాసనం పేర్కొంది. ఖాతాదారుల సాధారణ లావాదేవీలకు భిన్నంగా భారీ మొత్తాల బదిలీకి ప్రయత్నిస్తే బ్యాంకులు అప్రమత్తమై, అను మానాస్పద లావాదేవీలను ముందే నిలిపివేయాలని సూచిం చింది. కృత్రిమ మేధ (ఏఐ)తో మోసాలను గుర్తించడం, అవసరమైతే పోలీసులకు సమాచారం అందించడం వంటి చర్యలు చేపట్టాలని తెలిపింది. బ్యాంకుల నిర్లక్ష్యానికి శిక్షాత్మక నిబంధనలు ఉండాలని స్పష్టం చేసింది.

మ్యూల్ ఖాతాలపైనా నిఘా పెంచాలి



ఆర్‌బీఐ ప్రతిపాదించిన కేవైసీ సవరణ మార్గదర్శకాలు–2026ను పరిశీలించిన తర్వాతే తదుపరి ప్రక్రియకు అనుమతిస్తామని ధర్మాసనం తెలిపింది. మరోవైపు, డిజిటల్ అరెస్టు కేసుల వివరాలతో నివేదికలు సమర్పించాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించింది. సైబర్ నేరాల సొమ్ము బదిలీకి ఉపయోగించే మ్యూల్ ఖాతాలపైనా నిఘా పెంచాలని సూచించింది. 9,400 ఖాతాలపై చర్యలు తీసుకున్నామని, అనుమానాస్పద ఖాతాలను గుర్తించి వినియోగదారులను హెచ్చరించే సాఫ్ట్‌వేర్‌పై పనిచేస్తున్నామని వాట్సాప్ తరఫున కపిల్ సిబల్ కోర్టుకు తెలిపారు.

నేడు గుజరాత్‌కు ప్రధాని



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోడీ రెండు రోజుల పాటు గుజరాత్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా బనాస్‌కాంతా జిల్లాలో రూ.14 వేల కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు పలు పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. ఏక్తానగర్‌లో రూ.400 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులను ప్రారంభించనున్నట్లు పీఎంవో వెల్లడించింది. రైతులకు ఆర్థిక సహాయం అందించే పీఎం–కిసాన్ పథకం 24వ విడతగా రూ.19 వేల కోట్లను విడుదల చేయనున్నారు. రెండు రైలు సర్వీసులకు పచ్చజెండా ఊపడంతో పాటు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. పర్యటన ప్రారంభంలో బనాస్‌కాంతాలోని ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్ టెక్నాలజీ–ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ ప్రయోగశాలను, భారత్ బోవైన్ బ్రీడింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్ పశు పరిశోధన కేంద్రాన్ని ప్రధాని సందర్శిస్తారు. భిల్డీలో 127 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని జాతి పశువుల అభివృద్ధి, జన్యు నాణ్యత పెంపునకు కేంద్రంగా తీర్చిదిద్దారు. కాంక్రేజ్ జాతి పశువుల కోసం దేశంలోనే తొలిసారిగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా, దీని ద్వారా పశువుల జాతి మెరుగుదల ప్రక్రియ 10 నుంచి 20 రెట్లు వేగవంతం కానుంది. బనాస్ డెయిరీ ఆధ్వర్యంలో థరాద్, రాధన్‌పూర్‌లలో బయో–సీఎన్‌జీ ప్లాంట్లకు శంకుస్థాపన చేయనున్నారు. అహ్మదాబాద్ మెట్రో రెండో దశలో భాగంగా విమానాశ్రయానికి, గిఫ్ట్ సిటీకి పొడిగించే మార్గాలకు కూడా ప్రధాని శంకుస్థాపన చేస్తారు. అహ్మదాబాద్–మెహసానా రాష్ట్ర రహదారిని ఎనిమిది లేన్లకు విస్తరించే పనులతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి కింద రూ.4,950 కోట్ల వ్యయంతో పూర్తయిన 521 ప్రాజెక్టులను దేశానికి అంకితం చేయనున్నారు. సనాదర్‌లో బంగాళాదుంపల ప్రాసెసింగ్ ప్లాంట్ విస్తరణను, పాలన్‌పూర్‌లో ఆటోమేటెడ్ స్టోరేజ్ అండ్ రిట్రీవల్ సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. సబర్మతి–చారణాసి ఎక్స్‌ప్రెస్, మెహసానా–బెచరాజీ–సబర్మతి మెము రైళ్లను ప్రారంభించడంతో పాటు 12 ఉద్యానవన క్లస్టర్లలో పనులను ప్రారంభిస్తారు. అక్టోబర్ 31న ఏక్తా నగర్‌లోని ఐక్యతా విగ్రహం వద్ద సర్దార్ వల్లభభాయ్ పటేల్‌కు నివాళులు అర్పించి, రూ.400 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా 'భారత్ పర్వ్ 2026'ను ప్రారంభించనున్నారు. దేశ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించే ఈ ఉత్సవం 15 వరకు కొనసాగనుంది. 'ఏక్తా ప్రకాశ్ పర్వ్' పేరిట నిర్వహించే దీపాలంకరణ ఉత్సవాన్ని వీక్షించడంతో పాటు, పలు అభివృద్ధి పనులను ప్రారంభించ నున్నారు.

లాఠీలకు భయపడొద్దు

- రామ్‌లీలా మార్చ్‌కు రాహుల్ గాంధీ పిలుపు
- నవంబర్ 1న 'ఓటు చోరీ'కి వ్యతిరేకంగా ఇండియా కూటమి నిరసన
- పండుగ వ్యాపారాలకు నష్టం కలుగుతుందన్న వ్యాపార సంఘాలు

న్యూఢిల్లీ: 'ఓటు చోరీ' ఆరోపణలకు వ్యతిరేకంగా నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న నిరసన ర్యాలీ విషయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వెనక్కి తగ్గడం లేదు. దీపావళి పండుగ సమయంలో వ్యాపార కార్యకలాపాలకు అంతరాయం కలగవచ్చని, ర్యాలీని వాయిదా వేయాలని స్థానిక వ్యాపార సంఘాలు కోరుతున్నప్పటికీ నిరసన నిర్వహణకే ఆయన మొగ్గు చూపుతున్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో చేసిన పోస్టులో ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజలంతా ర్యాలీలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటం, ఓటు చోరీని అడ్డుకోవడం, రాజ్యాంగాన్ని పరిరక్షించడం లక్ష్యంగా 'చలో ఢిల్లీ రామ్‌లీలా మార్చ్' నిర్వహిస్తున్నట్లు రాహుల్ పేర్కొన్నారు. ఈ నిరసనను ఏ ఒక్క రాజకీయ పార్టీకి మాత్రమే పరిమితమైన కార్యక్రమంగా చూడకూడదని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై అసంతృప్తి ఉన్నవారంతా ర్యాలీలో పాల్గొనవచ్చని పిలుపునిచ్చారు. ''ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు మనమంతా కలిసి నడుద్దాం. పోలీసులకు, లాఠీచార్జీలకు భయపడొద్దు. ఇది దేశం కోసం చేపడుతున్న యాత్ర.. ఇది మీ యాత్ర'' అని రాహుల్ తన పోస్టులో పేర్కొన్నారు.



మరోవైపు, దీపావళి పండుగ సీజన్‌లో ఢిల్లీలో భారీగా వ్యాపార లావాదేవీలు జరుగుతాయని ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) తెలిపింది. నవంబర్ 1న నిరసన నిర్వహిస్తే రామ్‌లీలా మైదానం పరిసరాల్లో సుమారు రూ.10 వేల కోట్ల వ్యాపారంపై ప్రభావం పడవచ్చని అంచనా వేసింది. అందువల్ల నిరసనను నవంబర్ 10 తర్వాత నిర్వహించాలని సీటీఐతో పాటు ఇతర వ్యాపార సంఘాలు కోరుతున్నాయి.



నీటి పొదుపుపై రైతులకు అవగాహన

యాసంగిలో తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

ప్రజానావ, బోయినపల్లి : రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం తడగొండ గ్రామంలో ఎల్‌ఎన్‌ఓ ప్రభావం, నీటి పొదుపుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్సీ వ్యవసాయ విద్యార్థులు, టీఆర్‌వీకే సమన్వయకర్తలు డాక్టర్ ఆర్. సాయికుమార్, పి. మధుకర్‌రావు మాట్లాడుతూ ఎల్‌ఎన్‌ఓ ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉండటంతోపాటు భూగర్భ జలాలపై ఒత్తిడి పెరిగే పరిస్థితులు ఉన్నాయని వివరించారు. యాసంగిలో నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులు గ్రామంలో నీటి సంరక్షణ, పంటల మార్పిడిపై అవగాహన కల్పిస్తూ గోడలపై నినాదాలు రాశారు. నీటిని వృథా చేయకుండా కాపాడతామని, తక్కువ నీటితో పండే పంటలు సాగు చేస్తామని రైతులతో ప్రతిజ్ఞ చేయించారు. గ్రామ సర్పంచ్, పాలకవర్గం సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, ఉపసర్పంచ్ వెంకటేశ్, వ్యవసాయ విద్యార్థులు సాయి చందన, కిరణ్, నివేదిత, వర్షిణి, నిరంజన, రైతులు పాల్గొన్నారు.

తలకొండపల్లిని కరువు మండలంగా ప్రకటించాలి

- ఎండుతున్న పంటలు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- రైతులకు కరువు సాయం అందించాలి
- గౌతరెడ్డి విజయకుమార్‌రెడ్డి

ప్రజానావ, తలకొండపల్లి : పంటలు ఎండిపోయి, భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో పాటు పెట్టుబడులు కూడా తిరిగి రాని దుస్థితిలో ఉన్న తలకొండపల్లి మండలాన్ని కరువు మండలాల జాబితాలో చేర్చకపోవడంపై బీఆర్ఎస్ నాయకుడు గౌతరెడ్డి విజయకుమార్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని 32 గ్రామ పంచాయతీల పరిధిలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించి తక్షణమే కరువు మండలంగా ప్రకటించా లని, అర్హులైన రైతులకు కరువు సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తలకొండపల్లి మండలం ధనిక ప్రాంతమా? ఇక్కడి రైతులంతా లక్షాధికారులా? పంటలు ఎండిపోతూ, బోర్లలో నీరు అడుగంటిపోతున్నా ప్రభుత్వానికి రైతుల కష్టాలు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. మండలంలో నదీ జలాలు, సాగునీటి కాలువలు, పెద్ద చెరువుల ద్వారా నిరంతర సాగునీటి సౌకర్యం లేకపోవడంతో రైతులు వర్షాలు, భూగర్భ జలాలపైనే ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. ఒకవైపు పంట నష్టాలు, మరోవైపు పెరిగిన నిత్యావసర ధరలు, వ్యవసాయ పెట్టుబడుల భారం రైతు కుటుంబాలను ఆర్థిక సంక్షోభంలోకి నెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంటల సాగు కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించక రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మండలాన్ని కరువు జాబితా నుంచి మినహాయించి చడం రైతులకు అన్యాయం చేయడమేనని విమర్శించారు. అధికారులు తక్షణమే మండలంలోని గ్రామాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి పంట నష్టం, భూగర్భ జలాల పరిస్థితి, సాగునీటి లభ్యత, రైతుల ఆర్థిక ఇబ్బందులను సమగ్రంగా అంచనా వేయాలని కోరారు. ఆ నివేదిక ఆధారంగా తలకొండపల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి అర్హులైన రైతులకు కరువు సాయం అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రుణమాఫీకి సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కోరారు. పంటలు పండక నష్టపోతున్న రైతులకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గౌతరెడ్డి విజయకుమార్‌రెడ్డి స్పష్టం చేశారు.

కళాశాల హాస్టల్‌లో విద్యార్థుల ఘర్షణ

- ఇంటర్ విద్యార్థికి తీవ్ర గాయాలు
- అభయ ఆస్పత్రిలో చికిత్స.. పరిస్థితి విషమం
- డబ్బుల వివాదమే కారణమని సమాచారం



ప్రజానావ, బోడుప్పల్ : మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్‌లోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల హాస్టల్‌లో విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి కందుల అనూప్ (17) తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం బోడుప్పల్‌లోని అభయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పెద్దపల్లి జిల్లా ఓదెడు గ్రామానికి చెందిన అనూప్ శ్రీచైతన్య కళాశాలలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. యశ్వంత్ సింగ్, రణధీర్‌తో పాటు మరో విద్యార్థి అతడిపై దాడి చేసినట్లు తెలుస్తోంది. విద్యార్థుల మధ్య డబ్బుల విషయంలో తలెత్తిన వివాదమే ఘర్షణకు కారణమని సమాచారం. పండుగ సెలవుల అనంతరం కళాశాలకు తిరిగి వచ్చిన మరుసటి రోజే ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలిసింది. హాస్టల్‌లో విద్యార్థుల మధ్య ఘర్షణ తీవ్ర గాయాలకు దారితీయడం, ఘటనపై కళాశాల యాజమాన్యం పోలీసులకు సమాచారం ఇవ్వలేదన్న ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. విద్యార్థుల పర్యవేక్షణ, హాస్టల్ భద్రతా ఏర్పాట్లపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకుని వివరాలు సేకరించినట్లు తెలిసింది. ఘటనకు గల కారణాలు, దాడిలో ఎవరెవరి ప్రమేయం ఉందన్నది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. అనూప్ తల్లిదండ్రులు మానస, శ్రీనివాస్ దంపతులు కుమారుడి పరిస్థితిపై ఆందోళన చెందుతున్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు

ప్రజానావ, హైదరాబాద్ : జగద్గిరిగుట్టలోని వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీని బుధవారం లెక్కించారు. తొమ్మిది నెలలకు సంబంధించిన హుండీ కానుకల ద్వారా రూ.5,93,862 ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రణీత్, ఈఓ వి. సతీష్‌కుమార్ పర్యవేక్షణలో మాజీ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, ఆలయ ధర్మకర్త వేణుగౌడ్ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.







సాంస్కృతిక వారధులుగా విద్యార్థులు నిలవాలి

- చరిత్ర, సంప్రదాయాలపై అవగాహన పెంచుకోవాలి
- గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

ప్రజానావ, హైదరాబాద్ : విద్యా పర్యటనల్లో వినోదానికే పరిమితం కాకుండా ఆయా ప్రాంతాల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంచుకోవాలని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా విద్యార్థులకు సూచించారు. 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్–యువ సంగమం ఏడో దశ'లో భాగంగా అస్సాం నుంచి తెలంగాణకు వచ్చిన 72 మంది విద్యార్థులతో లోక్‌భవన్‌లో ఆయన ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా చార్మినార్ చరిత్ర, గోల్కొండ కోట నిర్మాణ విశిష్టత, తెలంగాణ భాష, ఆహారపు అలవాట్లు, పండుగల ప్రత్యేకతలను తెలుసుకోవాలని సూచించారు. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ, హైదరాబాద్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం కేవలం విహారయాత్ర కాదని, జ్ఞానాన్ని పెంపొందించుకునే అవకాశమని పేర్కొన్నారు. దేశంలోని భిన్న సంస్కృతులు, సంప్రదాయాలు, కళలు, జీవన విధానాలను పరస్పరం తెలుసుకోవడమే కార్యక్రమ లక్ష్యమన్నారు. అస్సాం, తెలంగాణ మధ్య సాంస్కృతిక అనుబంధాన్ని బలోపేతం చేస్తూ, రెండు ప్రాంతాల విశిష్టతలను పరస్పరం పరిచయం చేసే వారధులుగా విద్యార్థులు నిలవాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన ఈ కార్యక్రమం జాతీయ సమైక్యతను మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు. తెలంగాణలో తమ పర్యటన అనుభవాలను విద్యార్థులు గవర్నర్‌తో పంచుకుంటూ, రాష్ట్ర ఆతిథ్యం, హైదరాబాద్ సాంకేతిక అభివృద్ధి తమను ఆకట్టుకున్నాయని చెప్పారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్, సంయుక్త కార్యదర్శి కొమండూరు శశి కిరణ్, హైదరాబాద్ విశ్వవిద్యాలయం నోడల్ అధికారి డాక్టర్ ఎస్. అరుళ్మొజి, అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంస్కృతి సమాజాలను కలిపే వారధి

సంస్కృతి ప్రజల జీవన విధానాలు, సంప్రదాయాలు, విలువలను ప్రతిబింబిస్తుందని, విభిన్న సంగీత సంప్రదాయాలు భారతదేశంలోని భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనమని గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. సౌత్ ఇండియన్ కల్చరల్ అసోసియేషన్ (సికా) ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో నిర్వహించిన 68వ వార్షిక కళోత్సవాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కర్ణాటక, హిందుస్థానీ సంగీత సంప్రదాయాలు భారతీయ సంగీత వైభవాన్ని చాటుతున్నాయని పేర్కొన్నారు. సంప్రదాయాలను పరిరక్షిస్తూనే సంగీతాన్ని అభివృద్ధి చేయాలని, యువ కళాకారులను ప్రోత్సహించాలని సూచించారు. 1969లో స్థాపించిన సికా హైదరాబాద్, సికింద్రాబాద్ ప్రాంతాల్లో సంగీతాభిమానులకు విశేష సేవలందిస్తోందని ప్రశంసించారు. వర్ధమాన కళాకారులకు ప్రతిభను ప్రదర్శించే అవకాశాలు కల్పించడం అభినందనీయమని పేర్కొంటూ, సంస్థ భవిష్యత్తు కార్యక్రమాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సికా అధ్యక్షుడు డాక్టర్ చక్రవర్తి, కార్యవర్గ సభ్యులు, సంగీత కళాకారులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనుల శంకుస్థాపనలో బీజేపీ, కాంగ్రెస్ వాగ్వాదం

ఎంపీ ఈటల రాజేందర్‌కు సమాచారం ఇవ్వలేదని బీజేపీ నేతల ఆగ్రహం

ప్రజానావ, సికింద్రాబాద్ : సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం లోని మోండా డివిజన్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనుల శంకుస్థాపన సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. రూ.35 లక్షల నిధులతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శ్రీగణేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక మాట్లాడుతూ.. తాను 2024లో కార్పొరేటర్‌గా ఉన్న సమయంలోనే ఈ నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎంపీ ఈటల రాజేందర్‌కు సమాచారం ఇవ్వకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఇరు పార్టీల కార్యకర్తలు 'జై బీజేపీ', 'జై కాంగ్రెస్' అంటూ నినాదాలు చేయడంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

268 మంది విద్యార్థుల పరీక్ష ఫీజులు చెల్లింపు

- ఉన్నతి అండ్ శిక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేయూత


ప్రజానావ, తలకొండపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించి, వారి విద్యాభివృద్ధికి తోడ్పడే లక్ష్యంతో ఉన్నతి అండ్ శిక్ష ఫౌండేషన్ ముందుకొచ్చింది. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని తొమ్మిది ప్రభుత్వ పాఠశాలలతో పాటు వెల్జాల్‌లోని ఒకేషనల్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 268 మంది విద్యార్థుల పరీక్ష ఫీజులను ఫౌండేషన్ చైర్మన్ ఎర్ర సుధాకర్‌రెడ్డి అందజేశారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్ర సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థలను ప్రోత్సహించి, విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందుబాటులో ఉండేలా కృషి చేస్తే వారు ఉన్నత విజయాలు సాధించగలరని తెలిపారు. ఇదే లక్ష్యంతో ఉన్నతి అండ్ శిక్ష ఫౌండేషన్ పనిచేస్తోందని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి, పట్టుదలతో చదివి ఉత్తమ మార్కులు సాధించాలని, తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఉన్నత స్థాయికి ఎదగడంతో పాటు సమాజానికి ఉపయోగపడే పౌరులుగా రూపుదిద్దుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బండి రఘుపతి, సభ్యులు వసపుల రమేష్, మూడవత్ శివ, నితిన్‌తో పాటు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మెట్రోకు అనుసంధానంగా పాడ్ కార్లు

- డిపోల కోసం 185 ఎకరాల భూమి అవసరం
- 2050 నాటికి రోజుకు 1.14 లక్షల మంది ప్రయాణిస్తారని అంచనా

ప్రజానావ, హైదరాబాద్ : నగరంలో మెట్రో రైళ్లకు అనుసంధానంగా పాడ్ కార్లను నడిపేందుకు ఉద్దేశించిన వ్యక్తిగత వేగవంత రవాణా వ్యవస్థ (పీఆర్‌టీఎస్) ఏర్పాటుపై అధ్యయనం కొనసాగుతోంది. ఈ వ్యవస్థకు అవసరమైన డిపోల కోసం సుమారు 185 ఎకరాల భూమి కావాలని అధ్యయన సంస్థ లీ అసోసియేట్స్ గుర్తించింది. పీఆర్‌టీఎస్ మార్గాలకు సమీపంలోనే డిపోలు ఏర్పాటు చేయాల్సి ఉండటంతో ఏయే ప్రాంతాల్లో ఎంత భూమి అవసరమో నివేదికలో వివరించింది. మొదటి కారిడార్ కూకట్‌పల్లి నుంచి ప్రారంభం కానుండటంతో అక్కడ డిపో కోసం 104.8 ఎకరాలు అవసరమని పేర్కొంది. హైటెక్‌సిటీలో ఒకచోట 30.2 ఎకరాలు, మరోచోట 2.3 ఎకరాలు, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఒకచోట 39.7 ఎకరాలు, మరో రెండు ప్రాంతాల్లో కలిపి 3.5 ఎకరాలు కావాలని గుర్తించింది. రెండో కారిడార్‌లో పీపుల్స్ ప్లాజా ఎదురుగా 0.9 ఎకరాలు, బతుకమ్మ ఘాట్ పార్కింగ్ వద్ద 0.8 ఎకరాలు, సంజీవయ్య పార్కు సమీపంలో 0.7 ఎకరాలు, రాణిగంజ్ బస్ డిపో వద్ద 1.5 ఎకరాలు అవసరమని నివేదికలో పొందుపరిచింది. ఈ భూములు వేర్వేరు ప్రభుత్వ సంస్థల ఆధీనంలో ఉండటంతో వాటి కేటాయింపునకు సంబంధించి హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్ త్వరలో ఆయా విభాగాలకు లేఖలు రాయనుంది.



ఐటీ భవనాల సమీపంగా మార్గాలు

పీఆర్‌టీఎస్ మార్గాల రూపకల్పనలో భాగంగా ఐటీ కారిడార్‌లోని ప్రభుత్వ భవనాలు, ప్రైవేటు ఐటీ పార్కుల సమీపం నుంచి అలైన్‌మెంట్‌ను ప్రతిపాదించారు. ప్రయాణ దూరాన్ని తగ్గించేందుకు కొన్ని చోట్ల కార్యాలయాల ప్రాంగణాల మీదుగా కూడా మార్గాలను రూపొందించినట్లు అధ్యయనంలో పేర్కొన్నారు. మొదటి అధ్యయన ప్రాంతాన్ని మూడు జోన్లుగా విభజించారు. కూకట్‌పల్లి నుంచి రాయదుర్గం వరకు 7.62 కిలోమీటర్లు, రాయదుర్గం మెట్రో స్టేషన్, హైటెక్‌సిటీ మెట్రో స్టేషన్, నాలెడ్జ్ సిటీ పరిధిలో 12.83 కిలోమీటర్లు, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో 14.01 కిలోమీటర్ల మేర మార్గాలను పరిశీలించారు. ఈ మూడు జోన్లలో కలిపి పది పీఆర్‌టీఎస్ టెర్మినల్ స్టేషన్లను ప్రతిపాదించారు. ప్రస్తుతం ఉన్న మెట్రో, ఎంఎంటీఎస్ స్టేషన్లకు అనుసంధానంగా కేపీహెచ్‌బీ, హైటెక్‌సిటీ, దుర్గం చెరువు, రాయదుర్గం మెట్రో స్టేషన్లు, హైటెక్‌సిటీ ఎంఎంటీ ఎస్ స్టేషన్ వద్ద పీఆర్‌టీఎస్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. భవిష్యత్తులో మెట్రో విస్తరణను దృష్టిలో ఉంచుకుని నానక్‌రాంగూడ, విప్రో సర్కిల్, బయోడైవర్సిటీ, ఇందిరానగర్/రాడిసన్ జంక్షన్, అమెరికా కాన్సులేట్ మెట్రో స్టేషన్ల వద్ద కూడా స్టేషన్లను ప్రతిపాదించారు.

రెండో ప్రాంతంలోనూ అధ్యయనం

రెండో అధ్యయన ప్రాంతంలో సచివాలయం, ఎన్టీఆర్ మార్గ్, ఖైరతాబాద్, లక్డీకాపూల్ మెట్రో స్టేషన్లు, ఇక్బాల్ మినార్ జంక్షన్, అసెంబ్లీ మెట్రో స్టేషన్, సికింద్రాబాద్ వెస్ట్, బేగంపేట మెట్రో స్టేషన్లు, సంజీవయ్య పార్కు, జేమ్స్ స్ట్రీట్ ఎంఎంటీఎస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈ రెండు అధ్యయన ప్రాంతాలు కలిపి సుమారు 20 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఉన్నాయి. ప్రయాణికుల సంఖ్య పెరుగుదల: 2030 నాటికి 17.43 కిలోమీటర్ల నెట్‌వర్క్ పరిధిలో రోజుకు 75 వేల మంది ప్రయాణిస్తారని అంచనా వేశారు. 2040 నాటికి ఈ సంఖ్య 96 వేలకు, 2050 నాటికి 1.14 లక్షలకు చేరుతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ రెండు అధ్యయన ప్రాంతాల్లో 10.86 లక్షల మంది నివసిస్తుండగా, 2050 నాటికి జనాభా 20.88 లక్షలకు పెరుగుతుందని అంచనా. ప్రస్తుతం 8.37 లక్షల మంది ఉపాధి పొందుతుండగా, 2050 నాటికి ఈ సంఖ్య 17.08 లక్షలకు చేరుతుందని నివేదిక పేర్కొంది.

రద్దీకి జీఆర్‌టీఎస్ ప్రత్యామ్నాయం

పీఆర్‌టీఎస్ పాడ్ కార్లలో నలుగురి నుంచి ఆరుగురు ప్రయాణించవచ్చు. రద్దీ ఎక్కువగా ఉన్న సమయాల్లో ప్రయాణికుల అవసరాలను తీర్చేందుకు గ్రూప్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (జీఆర్‌టీఎస్)ను కూడా ప్రవేశపెట్టవచ్చని అధ్యయన సంస్థ సూచించింది. ఈ విధానంలో ఒక వాహనంలో 20 నుంచి 25 మంది వరకు ప్రయాణించే అవకాశం ఉంటుంది.



కష్టాల్లో ఉన్న కుటుంబానికి కౌన్సిలర్ ఆర్థిక భరోసా

ఎనిమిదేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్న ఆంజనేయులుకు నెలకు రూ.2 వేల సాయం

ప్రజానావ, పరిగి : రాజకీయాల్లో పదవులు చేపట్టేవారు ఎంతోమంది ఉంటారు.. కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా నిలిచేవారు కొందరే. ఈ కోవలోనే పరిగి పట్టణంలోని 15వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ మిడిగడ్డ శ్రీనివాస్ తన వంతు సాయం అందిస్తున్నారు. అదే వార్డుకు చెందిన ఆంజనేయులు గత ఎనిమిదేళ్లుగా పక్షవాతంతో బాధపడుతూ మాట కూడా సరిగా రాని పరిస్థితిలో ఉన్నారు. అనారోగ్యం కారణంగా కుటుంబ పోషణతోపాటు నిత్యావసరాలు సమకూర్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అర్హత ఉన్నప్పటికీ ప్రభుత్వ పింఛన్ అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న కౌన్సిలర్ మిడిగడ్డ శ్రీనివాస్ ఆయనకు అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు. కౌన్సిలర్‌గా ఎన్నికైనప్పటి నుంచి తన సొంత డబ్బులతో ప్రతి నెలా రూ.2 వేల ఆర్థిక సాయం అందిస్తున్నారు. స్వయంగా ఆంజనేయులు ఇంటికి వెళ్లి నగదు అందజేస్తూ కష్టకాలంలో అండగా ఉంటానని భరోసా కల్పిస్తున్నారు. మరోవైపు, ప్రభుత్వ పింఛన్ అందక ఇబ్బందులు పడుతున్న ఆంజనేయులుకు సంబంధిత అధికారులు అర్హతను పరిశీలించి పింఛన్ మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రక్తదాన శిబిరంలో 102 యూనిట్ల రక్తం సేకరణ

- పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాల సందర్భంగా పోలీస్ శాఖ, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహణ

ప్రజానావ, ఆమనగల్లు : ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, ప్రాణాలను కాపాడటంలో భాగస్వాములు కావడమే లక్ష్యంగా ఆమనగల్లు పోలీస్ శాఖ మరో సేవా కార్యక్రమాన్ని నిర్వహించింది. పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాలు–2026, అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమనగల్లు పోలీస్ స్టేషన్‌లో పోలీస్ శాఖ, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో యువత, విద్యార్థులు, పోలీసు సిబ్బంది, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని మొత్తం 102 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. సేకరించిన రక్తాన్ని బ్లడ్ బ్యాంకుకు తరలించారు. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి ఐపీఎస్ ఆదేశాల మేరకు, మహేశ్వరం జోన్ డీసీపీ నారాయణరెడ్డి, మహేశ్వరం డివిజన్ ఏసీపీ జానకిరెడ్డి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, ఆమనగల్లు ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు, కడ్తాల్ ఎస్‌హెచ్‌ఓ సైదిరెడ్డి, ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడవచ్చని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.



అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

- ఫర్నిచర్ దగ్ధం
- రెండు అగ్నిమాపక వాహనాలతో మంటలు అదుపు
- తప్పిన ప్రాణాపాయం

ప్రజానావ, అల్వాల్ : అల్వాల్ పరిధిలోని మచ్చ బొల్లారంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గంగా ఎన్‌క్లేవ్‌లోని ఎస్టిలో డివైన్ అపార్ట్‌మెంట్ మూడో అంతస్తులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఇంట్లోని ఫర్నిచర్ దగ్ధమైంది. అపార్ట్‌మెంట్‌లో మంటలు వ్యాపించడాన్ని గమనించిన నివాసితులు భయాందోళనకు గురై బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని రెండు అగ్నిమాపక వాహనాల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదం జరిగిన సమయంలో సంబంధిత ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. అగ్నిప్రమాదానికి గల కారణాలపై అల్వాల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన అంజయ్యకు మెరుగైన వైద్యం అందించాలి

సంజీవని ఆసుపత్రిలో బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యే బాలు నాయక్

ప్రజానావ, నల్లగొండ : చందంపేట మండలం రేకులగడ్డ గ్రామానికి చెందిన కడ్తాల అంజయ్య ద్విచక్ర వాహనంపై వెళ్తూ ప్రమాదవశాత్తు కిందపడి గాయాలపాలయ్యారు. ప్రస్తుతం దేవరకొండలోని సంజీవని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అంజయ్యను దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పరామర్శించారు. ఈ సందర్భంగా వైద్యులను అడిగి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అంజయ్యకు మెరుగైన వైద్య సేవలు అందించి, త్వరగా కోలుకునేలా అవసరమైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. బాధితుడి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎలుక జలందర్ గౌడ్, సన్నాయిల ఉమామహేశ్వర్, కేతావత్ భధ్య నాయక్, చిలకల అంజయ్య, కేతావత్ రమేష్ నాయక్, బక్కతట్ల వెంకటయ్య, కేతావత్ లాల్ సింగ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి 80 మంది చేరిక

- **ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ఆకర్షితులై పార్టీలో చేరికలు**
- **ఎమ్మెల్యే వేముల వీరేశం**



ప్రజానావ, నకిరేకల్ : కట్టంగూర్ మండలం మల్లారం గ్రామానికి చెందిన వార్డు సభ్యులు దాసరి లింగయ్య, దాసరి కళమ్మతో పాటు మొత్తం 80 మంది ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ నాయకులతో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కరాటేలో పతకాల పంట

- **జాతీయ పోటీలకు ఐదుగురు ఎంపిక**
- **విద్యార్థులను అభినందించిన వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి, సింధు ఆదర్శ్‌రెడ్డి**



ప్రజానావ, పటాన్‌చెరు : విశాఖపట్నంలోని గాజువాక రాజీవ్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఐదో దక్షిణ మండల కరాటే ఛాంపియన్‌షిప్–2026లో పతకాలు సాధించిన సెరియోకు షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే అకాడమీ విద్యార్థులు పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి వెన్నవరం ఆదర్శ్ రెడ్డి, భారతీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వి. సింధు ఆదర్శ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మాస్టర్ జి. అగస్టిన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులు ఇటీవల జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడంపై వారు అభినందనలు తెలిపారు. జి. విహాన్ కుమిటే విభాగంలో స్వర్ణ పతకం, కటా విభాగంలో రజత పతకం సాధించగా, జి. రిత్విక్ కుమిటేలో స్వర్ణ పతకం, కటాలో కాంస్య పతకం గెలుచుకున్నారు. వై. తన్వి రెడ్డి కుమిటేలో రజత పతకం సాధించగా, సయ్యద్ మహమ్మద్ తాహా, హెచ్. ఆద్య (శ్రీ కటా విభాగంలో కాంస్య పతకాలు సాధించి సత్తా చాటారు. ఈ ఐదుగురు విద్యార్థులు ఢిల్లీలోని తల్కటోరా ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న ఆల్ ఇండియా కరాటే ఛాంపియన్‌షిప్‌కు ఎంపిక కావడం పట్ల సింధు ఆదర్శ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలోనూ పతకాలు సాధించి తెలంగాణ రాష్ట్రంతో పాటు పటాన్‌చెరు ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన మాస్టర్ జి. అగస్టిన్‌ను కూడా వారు అభినందించారు.

తూప్రాన్‌లో జూనియర్ సివిల్ కోర్టు ఏర్పాటు

త్వరగా పనులు పూర్తి చేయాలని జిల్లా జడ్జి ఆదేశం



ప్రజానావ, తూప్రాన్ : మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు ఏర్పాటుకు హైకోర్టు నుంచి అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ ఆదేశాల మేరకు పట్టణంలోని పాత ఎంపీడీవో కార్యాలయ భవనంలో మరమ్మతులు, అభివృద్ధి పనులు చేపట్టి కోర్టును ఏర్పాటు చేశారు. కోర్టు ప్రారంభోత్సవాన్ని నవంబర్ 7న నిర్వహించనున్నట్లు జిల్లా జడ్జి నీలిమ తెలిపారు. ఈ నేపథ్యంలో గురువారం ఆమె నూతన కోర్టు భవనాన్ని పరిశీలించి, ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులను సోమవారం లోపు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కోర్టు ప్రారంభానికి అవసరమైన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ రమేశ్ కుమార్, ఎస్ఐ గంగరాజు, రెవెన్యూ సిబ్బంది, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రంలో ఖాళీ కుర్చీలే!

- **కొనుగోళ్లు ప్రారంభమైనా కనిపించని రైతులు**
- **అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు**



ప్రజానావ, బూర్గంపాడు : పత్తి కొనుగోళ్లు ప్రారంభమైనా రైతుల సందడి కనిపించకపోవడం చర్చనీయాంశంగా మారింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలోని భారత పత్తి సంస్థ (సీసీఐ) కొనుగోలు కేంద్రం రైతుల రాకపోకలతో కళకళలాడాల్సి ఉండగా, ఖాళీ కుర్చీలతో దర్శనమివ్వడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. పత్తి సేకరణ ప్రారంభమైన సమయంలోనే కేంద్రానికి రైతులు రాకపోవడానికి కారణాలేంటి? రైతులకు సరైన సమాచారం అందించడంలో అధికారులు విఫలమయ్యారా? కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిస్థాయిలో చేశారా? లేక నిబంధనలు, ప్రక్రియల పేరుతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రైతుల కోసం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో వారే కనిపించకపోతే ఆ ఏర్పాట్ల ప్రయోజనం ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కేంద్రాన్ని ప్రారంభించి, కుర్చీలు ఏర్పాటు చేయడంతోనే అధికారుల బాధ్యత ముగియదని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోళ్లు సజావుగా జరిగేలా చూడాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

అధికారుల పర్యవేక్షణ ఏది?

రైతులు కేంద్రానికి ఎందుకు రావడం లేదన్న విషయంపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారా? కొనుగోలు విధానం, అవసరమైన పత్రాలు, పత్తిలో తేమ శాతం నిబంధనలు, కేంద్రం పనితీరు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారా? వారి సమస్యలను తెలుసుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. కేంద్రంలో రైతులు కనిపించకపోవడానికి గల కారణాలను అధికారులు గుర్తించి వెల్లడించాల్సిన అవసరం ఉంది. అసలు సమస్యలను తెలుసుకోకుండా కొనుగోళ్లు సజావుగా సాగుతున్నాయని భావించడం ఎంతవరకు సమంజసమన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

రైతులకు మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలి!

పత్తి సాగు కోసం రైతులు నెలల తరబడి శ్రమించి, పెట్టుబడులు పెట్టి పంటను సిద్ధం చేస్తారు. అలాంటి రైతులకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధర అందేలా చూడటం అధికారుల ప్రధాన బాధ్యత. బూర్గంపాడు మండలంలో రైతులు కొనుగోలు కేంద్రానికి ఎందుకు రావడం లేదో గుర్తించి, సమస్యలు ఏవైనా ఉంటే తక్షణమే పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రం పనితీరుపై సమీక్ష నిర్వహించాలని, రైతులకు పూర్తి అవగాహన కల్పించి కొనుగోళ్ల ప్రక్రియలో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు. లేకపోతే రైతుల కోసం ఏర్పాటు చేసిన కేంద్రాలు కేవలం పేరుకే పరిమితమవుతున్నాయన్న విమర్శలు మరింత బలపడే అవకాశం ఉంది. రైతుల కోసం ఏర్పాటు చేసిన కేంద్రంలో రైతులే కనిపించకపోవడానికి కారణాలేంటి? ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పడంతో పాటు కొనుగోళ్ల సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది.



ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై బీఆర్ఎస్ దృష్టి

- **అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి**
- **ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి**

ప్రజానావ, నాగర్‌కర్నూల్ : కల్వకుర్తి నియోజకవర్గంలోని మాడుగుల, చారకొండ మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు అవగాహన సదస్సులు నిర్వహించారు. చారకొండ సర్పంచ్ గుండె విజేందర్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశాల్లో పార్టీ నాయకులు మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై అర్హులైన ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని పార్టీ నాయకులు, యువ నాయకులకు సూచించారు. నియోజకవర్గంలోని వివిధ మండలాలు, గ్రామాలు, పట్టణ వార్డుల వారీగా నాయకులు బాధ్యతలు తీసుకొని, అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదు కార్యక్రమాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్లి విజయవంతం చేయాలని కోరారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విజయాన్ని కానుకగా అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజిత రెడ్డి, గురువయ్య గౌడ్, గజ్జ యాదయ్యతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ వార్డు సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక ఎమ్మెల్సీ ఫలితాలు కాంగ్రెస్‌కు గుణపాఠం

బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ బంగ్లా లక్ష్మీ కాంత్‌రెడ్డి

ప్రజానావ, మక్తల్: కర్ణాటకలో ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి గుణపాఠమని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ బంగ్లా లక్ష్మీ కాంత్ రెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీపై వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకొని, ప్రజా సమస్యల పరిష్కారంపై కాంగ్రెస్ నాయకత్వం దృష్టి సారించాలని హితవు పలికారు. కర్ణాటకలో జరిగిన నాలుగు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల్లో బీజేపీ మూడు స్థానాల్లో, ఎన్డీఏ మిత్రపక్షమైన జేడీఎస్ ఒక స్థానంలో విజయం సాధించాయని పేర్కొన్నారు. ఈ ఫలితాలు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో ఉన్న అసంతృప్తికి నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. ఉపాధ్యాయులు, పట్టభద్రులు వంటి విద్యావంతుల వర్గాలు తమ ఓటు ద్వారా కాంగ్రెస్‌కు గట్టి గుణపాఠం చెప్పారన్నారు. ప్రధాని మోదీపై విమర్శలు చేయడం కంటే ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల పై కాంగ్రెస్ దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల ఫలితాలు ప్రజల అభిప్రాయాలను ప్రతిబింబిస్తాయని, ప్రజల విశ్వాసాన్ని పొందేందుకు రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డాక్టర్ బంగ్లా లక్ష్మీ కాంత్ రెడ్డి పేర్కొన్నారు.

పేదల వైద్యానికి రూ.15 లక్షల ఎల్ఓసీలు

ముగ్గురికి చెరో రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించిన మంత్రి వాకిటి శ్రీహరి

ప్రజానావ, మక్తల్ : వైద్య చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ముగ్గురికి మంత్రి వాకిటి శ్రీహరి అండగా నిలిచారు. నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు వైద్య ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.15 లక్షల విలువైన ఎల్ఓసీలను మంజూరు చేయించి అందజేశారు. నర్వ మండలం లంకల గ్రామానికి చెందిన అంజయ్యకు రూ.5 లక్షలు, పొగబండి అంజమ్మకు రూ.5 లక్షలు, మక్తల్‌కు చెందిన వెంకటేష్‌కు రూ.5 లక్షల విలువైన ఎల్ఓసీలను అందించారు. ఈ ఆర్థిక సహాయం బాధితులకు అవసరమైన వైద్య చికిత్స పొందేందుకు దోహదపడనుంది. ఆర్థిక స్థోమత లేక వైద్య చికిత్స చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్న పేదలకు అండగా నిలవాలనే లక్ష్యంతో ప్రభుత్వం వైద్య సహాయం అందిస్తోందని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, ఆపదలో ఉన్నవారికి తక్షణ సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తామని తెలిపారు.



జూలూరుపాడును కరువు మండలంగా ప్రకటించాలి

- **పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి**
- **సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు డిమాండ్**



ప్రజానావ, జూలూరుపాడు : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించకపోవడంపై సీపీఐ మండల సమితి తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం కరువు ప్రభావిత ప్రాంతాల గుర్తింపులో జూలూరుపాడు మండలాన్ని పరిగణనలోకి తీసుకోకపోవడం అన్యాయమని సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు విమర్శించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని వ్యవసాయ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి, అర్హత ఉన్న ప్రాంతాలకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రైతుల జీవనోపాధికి సంబంధించిన కీలక అంశంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, రైతుల కష్టాలు ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఒకవైపు రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటుంటే, మరోవైపు కరువు ప్రభావిత ప్రాంతాల గుర్తింపులో జూలూరుపాడు మండలానికి న్యాయం జరగకపోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మండలంలోని వాస్తవ వ్యవసాయ పరిస్థితులపై సమగ్ర పరిశీలన చేపట్టాలని డిమాండ్ చేశారు. జూలూరుపాడు మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించే అంశంపై తక్షణమే సమీక్ష నిర్వహించాలని, పంట నష్టపోయిన అర్హులైన రైతులకు నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందించాలని, రైతులకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం రైతుల ఇబ్బందులను నిర్లక్ష్యం చేయడం తగదని, జూలూరుపాడు మండల రైతులకు న్యాయం జరిగే వరకు సీపీఐ ప్రజల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి యాస రోశయ్య, ఎల్లంకి మధు, పొనేకంటి వెంకటేశ్వర్లు, వలమల్ల సామేలు, చీమకుర్తి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీ

- **సీసీ కెమెరాల్లో రికార్డైన దొంగతనం**
- **పోలీసులకు బాధితుడి ఫిర్యాదు**

ప్రజానావ, తూప్రాన్ : మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలోని మహంకాళి దేవాలయానికి వెళ్లే దారిలో ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. ఇంటి ముందు పార్క్ చేసిన వాహనం కాసేపట్లోనే మాయమవడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. తూప్రాన్‌కు చెందిన చిన్నలింగం సురేష్ గౌడ్ తన హీరో హోండా ద్విచక్ర వాహనం (నంబర్ టీఎస్ 15 ఈఎం 6469)ను ఇంటి ముందు నిలిపి ఇంట్లోకి వెళ్లాడు. తిరిగి వచ్చి చూసేసరికి వాహనం కనిపించకపోవడంతో పరిసరాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా, ద్విచక్ర వాహనాన్ని దొంగిలిస్తున్న దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఈ దృశ్యాల ఆధారంగా బాధితుడు తూప్రాన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, సీసీ కెమెరాల దృశ్యాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

రైతుల చాకచక్యంతో దొరికిన పుస్తెలతాడు దొంగలు

- **మహిళ మెడలో నుంచి మూడు తులాల బంగారు గొలుసు అపహరణ**
- **వెంబడించి పట్టుకున్న రైతులు**

ప్రజానావ, నంగారెడ్డి : హత్నూర, జిన్నారం మండలాల సరిహద్దుల్లో మహిళ మెడలో నుంచి మూడు తులాల బంగారు పుస్తెలతాడును అపహరించిన ఇద్దరు దొంగలను రైతులు వెంబడించి పట్టుకున్నారు. సోలక్‌పల్లికి చెందిన కిష్టమ్మ పొలంలో ఒంటరిగా పనిచేస్తుండగా ద్విచక్రవాహనంపై వచ్చిన పడ్డే సాయిలు, మీనంపల్లి అరవింద్ దారి అడుగుతున్నట్లు నటించారు. అనంతరం ఆమెపై దాడి చేసి మెడలోని మూడు తులాల బంగారు పుస్తెలతాడును లాక్కొని బైక్‌పై పారిపోయేందుకు ప్రయత్నించారు. ఇది గమనించిన రైతులు వెంటనే వారిని వెంబడించి పట్టుకున్నారు. ఆగ్రహానికి గురైన బాధితురాలు కిష్టమ్మ కర్రతో నిందితులను కొట్టినట్లు తెలిసింది. చోరీకి గురైన బంగారు పుస్తెలతాడును స్వాధీనం చేసుకున్న రైతులు దానిని బాధితురాలికి అప్పగించారు. సమాచారం అందుకున్న జిన్నారం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై గతంలోనూ నాలుగు దొంగతనం కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.



గిరిజన కళలకు 'చిత్రధార' శిక్షణ

నాలుగు రోజుల పాటు సంప్రదాయ చిత్రలేఖనంలో విద్యార్థులకు తర్ఫీదు

ప్రజానావ, పటాన్‌చెరు : సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పెద్ద కంజర్లలోని తెలంగాణ గిరిజన సంక్షేమ బాలుర డిగ్రీ కళాశాలలో ఏడు గిరిజన డిగ్రీ కళాశాలలు, ఒక న్యాయ కళాశాలకు చెందిన విద్యార్థుల కోసం 'చిత్రధార' పేరుతో నాలుగు రోజుల ప్రత్యేక గిరిజన చిత్రలేఖన శిక్షణ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. గిరిజన సంక్షేమ గురుకుల కార్యదర్శి కె. సీతాలక్ష్మి, ఐఏఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ (టీసీఆర్‌టీఐ)కు చెందిన ప్రముఖ చిత్రలేఖన నిపుణులు విద్యార్థులకు ప్రత్యక్ష శిక్షణ అందిస్తున్నారు. నాలుగు రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రతి రోజూ ఒక్కో గిరిజన తెగ సంస్కృతి, కళలకు సంబంధించిన చిత్రలేఖనంపై శిక్షణ ఇవ్వనున్నారు. నాయకపోడు, కోయ, గోండు, లంబాడీ తెగల సంప్రదాయ చిత్రకళా శైలులపై నిపుణులు విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించడంతో పాటు, వారితో స్వయంగా చిత్రాలు వేయిస్తున్నారు. గిరిజన కళలు, సంస్కృతిని భావితరాలకు అందించడంలో భాగంగా ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ గురుకుల జాయింట్ సెక్రటరీ డి.ఎస్. వెంకన్న, డిగ్రీ కళాశాలల ఉప కార్యదర్శి వేణుగోపాల్, విద్యా విభాగం ఉప కార్యదర్శి జి.బి. వెంకటేశ్, డిగ్రీ కళాశాల ఓఎస్‌డీ నీరజ, కళాశాల ప్రిన్సిపాల్ సునీల, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- **నషా ముక్త్ భారత్ అభియాన్‌లో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ**

ప్రజానావ, సంగారెడ్డి : యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు, స్వచ్ఛంద సేవకులు పాల్గొని మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, కుటుంబాలపై పడే ప్రభావం, యువత భవిష్యత్తుకు కలిగే నష్టాలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, చెడు అలవాట్లకు బానిసలు కాకుండా తమ ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై దృష్టి సారించాలని నిర్వాహకులు సూచించారు. మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, యువత, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్‌పర్సన్ వనజ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చందర్, జిల్లా కోశాధికారి డాక్టర్ ప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆకాశ ప్రీతం, జూనియర్ రెడ్‌క్రాస్, యూత్ రెడ్‌క్రాస్ సమన్వయకర్త లింగా గౌడ్, నిర్వహణ కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సేవకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. గాయత్రి పాఠశాల, భారతీయ విద్యా మందిర్ పాఠశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు. "మత్తు పదార్థాలకు దూరంగా ఉందాం.. ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దాం" అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా మత్తు పదార్థాల రహిత భారతదేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని నిర్వాహకులు సందేశమిచ్చారు.



సిరిసిల్లలో కార్మిక శాఖ అధికారిని నియమించాలి

ప్రజానావ, సిరిసిల్ల : సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సహాయ కార్మిక శాఖ అధికారిని వెంటనే నియమించాలని ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కడారి రాములు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్ లో భవన నిర్మాణం కార్మికులు సంక్షేమ బోర్డు సీఈవోకు వినతిపత్రం సమర్పించారు. సహాయ కార్మిక శాఖ అధికారులు లేనందున ఇబ్బందులు జరుగుతున్నాయని వెంటనే కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నియమించాలని కోరుతూ వినత పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి భవన నిర్మాణ సంఘం పిట్టల సమ్మయ్య పాల్గొన్నారు.

ఉపాధి పనులతో రోజుకు రూ.308 వేతనం

125 రోజుల పని కల్పించే పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజానావ, కామారెడ్డిపల్లి : గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మార్తా ఇంద్ర పాల్గొని కూలీలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీబీ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా ఏడాదిలో 125 రోజుల పాటు పని చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. రైతులకు అవసరమైన వ్యవసాయ ఆధారిత పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు పూర్తి చేస్తే రోజుకు రూ.308 వేతనం పొందేలా కూలీలు కృషి చేయాలని వివరించారు. ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వహించకుండా కూలీలందరూ సమన్వయంతో పనిచేసి, పథకం ద్వారా కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ బ్యాండ్ ప్రదర్శన

ప్రజల్లో అవగాహన కల్పించిన వరంగల్ పోలీస్ కమిషనరేట్ బృందం



ప్రజానావ, పరకాల : పోలీసు అమరవీరుల సంస్మరణ దినం (ఫ్లాగ్ డే) సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో పరకాల బస్టాండ్ సర్కిల్, అంబేద్కర్ సెంటర్‌లో పోలీసు బ్యాండ్ బృందం ప్రత్యేక ప్రదర్శన నిర్వహించింది. బ్యాండ్ బృందం వివిధ వాయిద్యాలతో నిర్వహించిన ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంది. 'వృథా కాదు మీ మరణం.. మాసిపోదు మీ త్యాగం', 'పోలీసు అమరవీరుల ఆశయాలను సాధిద్దాం' అనే నినాదాలతో ప్రజల్లో అవగాహన కల్పించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసు శాఖ చేస్తున్న కృషిని వివరించారు. అమరవీరుల సేవలు, త్యాగా లు సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ పవన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని, పట్టుదలతో కృషి చేయాలి

- **సురక్షిత్ బచ్పన్ అభియాన్ బాలలపై లైంగిక నేరాల నిరోధానికి పాఠశాలల్లో అవగాహన కార్యక్రమం**
- **పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన**
- **సిరిసిల్ల రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గడ్డం మేఘన**



ప్రజానావ, సిరిసిల్ల : విద్యార్థుల జీవితంలో ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకొని, వాటిని సాధించేందుకు పట్టుదలతో, క్రమశిక్షణతో, నిరంతరం కృషి చేయాలని సిరిసిల్ల రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గడ్డం మేఘన అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాల, గీతానగర్ లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు పి.నీరజ సూచనలతో బాలల హక్కులపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా "సురక్షిత్ బచ్పన్ అభియాన్" పేరుతో జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న పాఠశాలల స్థాయి అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పోక్సో చట్టం ప్రకారం, పిల్లలపై లైంగిక వేధింపులు లేదా అనుచిత ప్రవర్తనకు సంబంధించిన సంఘటనలు జరిగినప్పుడు వాటిని నిర్భయంగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని, బాధిత పిల్లలకు తక్షణ రక్షణ, న్యాయ సహాయం అందించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. పిల్లలపై లైంగిక నేరాలు జరిగినప్పుడు వాటిని దాచిపెట్టకుండా, చట్టప్రకారం సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని, బాధిత పిల్లల వ్యక్తిగత వివరాల గోప్యతను కాపాడుతూ వారికి మానసిక ధైర్యం, భరోసా కల్పించాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఇంచార్జి హెడ్ మాస్టర్ ఎం. తిరుపతి, లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్, న్యాయవాదులు ఆడెపు వేణు, కళ్యాణి, కుంట శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



బీజేపీ నేతల ముందస్తు అరెస్టులు

ఎమ్మెల్యేతో చర్చకు సిద్ధమైన నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలింపు

ప్రజానావ, పాలకుర్తి : కాంగ్రెస్ నాయకులు ఇటీవల దేవరుప్పుల మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు లేగ రామ్మోహన్ రెడ్డి డబ్బులు తీసుకున్నారంటూ ఆరోపణలు చేసిన నేపథ్యంలో, ఈ అంశంపై ఎమ్మెల్యేతో బహిరంగ చర్చకు సిద్ధమైన బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పాలకుర్తిలోని సోమేశ్వర లక్ష్మీ నరసింహస్వామి ఆలయం వద్ద ఎమ్మెల్యేతో బహిరంగ చర్చ నిర్వహించాలని బీజేపీ నాయకులు నిర్ణయించినట్లు సమాచారం. అయితే చర్చ జరగకముందే పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిలో బీజేపీ సీనియర్ నాయకుడు దొంగరి మహేందర్, పాలకుర్తి మండల అధ్యక్షుడు మారం రవికుమార్, మండల ప్రధాన కార్యదర్శి వేల్పుల దేవరాజు, పెనుగొండ సోమేశ్వర్ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇండ్లు త్వరితగతిన పూర్తి చేయించాలి

- **ఆర్థిక సహాయం సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలి**
- **మన ఇందిరమ్మ ఇండ్ల పురోగతిలో ఉత్తమ ప్రతిభ చూపిన బోయినపల్లి, ఇల్లంతకుంట అధికారులకు అభినందనలు**
- **జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
- **ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్.. మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, హౌసింగ్ ఏఈలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష**



ప్రజానావ, సిరిసిల్ల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, నిర్మాణం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్.. మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, హౌసింగ్ ఏఈలతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై మండలాల వారిగా సమీక్ష చేశారు. జిల్లాలో ఇప్పటిదాకా 6,465 ఇండ్లకు ముగ్గు పోశామని, 5,479 ఇండ్లు బేస్మెంట్ లెవెల్లో, 4, 858 ఇండ్లు గోడల లెవెల్ లో, 4,585 స్లాబ్ లెవెల్ లో, 3,934 ఇండ్లు పూర్తి అయ్యాయని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ముగ్గు పోసిన వారితో ఇంటి నిర్మాణ పనులు మొదలు పెట్టించాలని, బేస్మెంట్ వరకు పూర్తి చేసిన వారిని గోడల వరకు, అక్కడి నుంచి స్లాబ్ లెవెల్ కు, తుది దశ పనులు పూర్తి చేసేలా.. ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలో గుడిసెల్లో ఉంటున్న వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని, త్వరితగతిన నిర్మాణ ప్రక్రియ మొదలు పెట్టాలని సూచించారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల కింద మంజూరు అయిన ఇండ్ల పై ఆరా తీసి.. వాటి పురోగతిపై అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఎంపీడీఓ ఇండ్ల పురోగతిని పరిశీలించాలని సూచించారు. పురోగతిలో ఉన్న ఇండ్ల ఫోటోలు ఎప్పటికప్పుడు హౌసింగ్ ఏఈలు ఆన్లైన్ లో అప్ లోడ్ చేయాలని, లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయని వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఉత్తమ పనితీరు ప్రదర్శించిన బోయినపల్లి, ఇల్లంతకుంట మండలాల అధికారులు, సిబ్బందిని జిల్లా కలెక్టర్ అభినందించారు. వీడియో కాన్ఫరెన్స్ లో ఇంచార్జి హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఖాజా ముజాఫరుద్దీన్, జిల్లా పంచాయతీ అధికారి వీర భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



రామగుండం అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

- **రూ.35 కోట్లతో రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సెంట్రల్ లైటింగ్ పనులు**
- **సుమారు 1,000 కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు కల్పించే చర్యలు**

ప్రజానావ, పెద్దపల్లి : రామగుండం పట్టణంలోని పలు డివిజన్లలో ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ గడపగడపకు పర్యటిస్తూ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అయోధ్య నగర్ వెనుక ప్రాంతం నుంచి రాముని గుండాల వరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అనువైన స్థలాలను పరిశీలించి, సుమారు 1,000 కుటుంబాలకు ఇళ్లు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో రూ.35 కోట్లతో చేపడుతున్న రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సెంట్రల్ లైటింగ్ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. హౌసింగ్ బోర్డు ప్రాంతంలో రూ.2 కోట్లతో నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ పనులను పరిశీలించారు. మైనారిటీ కమ్యూనిటీ హాల్‌కు రూ.2 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్, రూ.1.50 కోట్లతో జెడ్పీహెచ్ఎస్ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ పర్యటనలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, అయోధ్య సింగ్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దీటి బాలరాజు, కార్పొరేషన్ అధ్యక్షుడు, కార్పొరేటర్ ముస్తఫా, పలువురు కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

నూతన బోర్ వేసేందుకు అనుమతి తప్పనిసరి

- **సూపర్ ఎల్‌నినో నేపథ్యంలో తాగునీటి అవసరాలకే బోర్లు వేయాలి**
- **బోర్ వెల్ యజమానులు భూగర్భ జల శాఖ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి**
- **జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
- **భూగర్భ జల శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు, బోర్ వెల్ యజమానులతో ఐడీఓసీలో జిల్లా కలెక్టర్ సమీక్ష**



ప్రజానావ, సిరిసిల్ల : వాల్టా చట్టం ప్రకారం జిల్లాలో నూతన బోర్ వెల్ వేసేందుకు తహసీల్దార్ నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని బోర్ వెల్ యజమానులకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. సూపర్ ఎల్ నినో నేపథ్యంలో.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, వ్యవసాయ, భూగర్భ జల శాఖ అధికారులు బోర్ వెల్ యజమానులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బోర్ వెల్ యజమానులకు రిజిస్ట్రేషన్ నిబంధనలు, వాల్టా చట్టం తదితర అంశాలపై అధికారులు వివరించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. సూపర్ ఎల్ నినో నేపథ్యంలో జిల్లాలో ఖరీఫ్ సీజన్లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురువలేదని, ప్రస్తుత చలికాలంలో ఎండలు చాలా ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. దీంతో భూగర్భ జలాలు రానురాను తగ్గుతున్నాయని వివరించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అన్ని జిల్లాలతో పోలిస్తే రాజన్న సిరిసిల్ల జిల్లా భూగర్భ నీటి మట్టాలు చాలా తక్కువగా ఉన్నాయని వెల్లడించారు.

మండలాల వారిగా భూగర్భ జలమట్టాలు

జిల్లాలోని ఆయా భూగర్భ జలాల లోతు నీటి మట్టం వివరాలు. బోయినపల్లి మండలం 4.78 మీటర్లు, చందుర్తి 5.31, గంభీరావుపేట 8.39, ఇల్లంతకుంట 4.65, కోనరావుపేట 7.03, ముస్తాబాద్ 8.50, రుద్రంగి 7.45, సిరిసిల్ల 14.62, తంగళ్లపల్లి 7.80, వీర్నపల్లి 13.03, వేములవాడ రూరల్ 4.81, వేములవాడ అర్బన్ 15.39, ఎల్లారెడ్డిపేట 10.91 మీటర్ల లోతులో ఉన్నాయని అధికారులు వెల్లడించారు. జిల్లా మొత్తం భూగర్భ జలాల సగటు 7.82 మీటర్లుగా ఉందని తెలిపారు. సమావేశంలో జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంపికై ఏళ్లు గడిచినా అందని నియామక ఉత్తర్వులు

- **పన్నెండేళ్లుగా ఎదురుచూపులు**
- **న్యాయం చేయాలని ఉన్నతాధికారులకు బాధితుల వేడుకోలు**

ప్రజానావ, గుడిహత్నూర్ : అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ పోస్టులకు ఎంపికై ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు నియామక ఉత్తర్వులు అందకపోవడంతో తమకు న్యాయం చేయాలని గుడిహత్నూర్ మండలానికి చెందిన కనక పుష్పలత, ఆత్రం లింగుబాయి ఉన్నతాధికారులను వేడుకుంటున్నారు. ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో 2012 అక్టోబరులో విడుదలైన నోటిఫికేషన్ మేరకు గుడిహత్నూర్ మండల కేంద్రానికి చెందిన కనక పుష్పలత, రాగాపూర్ పంచాయతీ పరిధిలోని బొర్రమద్ది గ్రామానికి చెందిన ఆత్రం లింగుబాయి దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం 2013 మార్చిలో గుడిహత్నూర్ ఆరో అంగన్‌వాడీ కేంద్రానికి టీచర్‌గా కనక పుష్పలత, బొర్రమద్ది అంగన్‌వాడీ కేంద్రానికి ఆయాగా ఆత్రం లింగుబాయి ఎంపికయ్యారు. అయితే ఎంపిక జరిగి పుష్కర కాలం కావస్తున్నా తమకు నియామక పత్రాలు అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియామక ఉత్తర్వులు జారీ చేయకపోవడానికి గల కారణాలను వెల్లడించాలని కోరుతూ 2018లో హైకోర్టును ఆశ్రయించామని, ప్రస్తుతం ఈ కేసు న్యాయస్థానంలో విచారణలో ఉందని తెలిపారు. ఇదిలా ఉండగా, తాను ఎంపికైన గుడిహత్నూర్ ఆరో అంగన్‌వాడీ కేంద్రంలోని టీచర్ పోస్టుకు ఈ నెల 16న అధికారులు మళ్లీ నోటిఫికేషన్ విడుదల చేయడంపై కనక పుష్పలత అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పటికే న్యాయస్థానం పరిధిలో ఉన్న పోస్టుకు తిరిగి నోటిఫికేషన్ ఇవ్వడంపై ఆమె అనుమానాలు వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, సంబంధిత ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి 2013 నాటి ఎంపిక రికార్డులను పరిశీలించాలని, పెండింగ్‌లో ఉన్న న్యాయపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని నిబంధనల ప్రకారం తమకు నియామక ఉత్తర్వులు జారీ చేసి న్యాయం చేయాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎల్‌నినో దెబ్బకు ఎస్సారెస్పీలో నీటి కష్టాలు

- **తాగునీటికే ప్రాధాన్యం**
- **యాసంగిలో ఆరుతడి పంటల సాగుకు సూచన**



ప్రజానావ, నిజామాబాద్ : ఎల్‌నినో ప్రభావం రాబోయే నెలల్లో తీవ్రంగా ఉండొచ్చన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో నీటిపారుదల శాఖ అప్రమత్తమైంది. తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, యాసంగిలో వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని రైతులకు అధికారులు సూచిస్తున్నారు. మరోవైపు ఎల్‌నినో ప్రభావంతో ఈసారి శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి ఆశించిన స్థాయిలో వరద నీరు చేరలేదు. దీంతో వానాకాలం పంటలకు ఒకే తడి నీటిని అందించగా, యాసంగి పంటలకు నీటిని విడుదల చేసే అవకాశం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టులో ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకే వినియోగించాలని అధికారులు నిర్ణయించారు.

తగ్గిన నిల్వ సామర్థ్యం

శ్రీరామసాగర్ ప్రాజెక్టు గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 112 టీఎంసీలు కాగా, పూడిక పేరుకుపోవడంతో ప్రస్తుతం 80 టీఎంసీలకే పరిమితమైంది. దీంతో 32 టీఎంసీల నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. గత బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం పూడిక తీత పనుల కోసం రూ.1,500 కోట్లు కేటాయించింది. ఈ వేసవి వరకు ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గే అవకా శం ఉన్న నేపథ్యంలో, ఈలోపు ఆయకట్టు పరిధిలోని కాలువలు, లైనింగ్, తూములు, షట్టర్లకు మరమ్మతులు చేపడితే భవిష్యత్తులో రైతులకు ప్రయోజనం కలుగుతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం శ్రీరామసాగర్ నుంచి మిషన్ భగీరథ పథకానికి రోజుకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇందులో కోరుట్ల, జగిత్యాల ప్రాంతాలకు 61 క్యూసెక్కులు, ఆదిలాబాద్, నిర్మల్ ప్రాంతాలకు 63 క్యూసెక్కులు, ఆర్మూర్, నిజామాబాద్, కామారెడ్డి ప్రాంతాలకు 107 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం గోదావరిపై నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను జూలై 1న తెరవగా, అక్టోబరు 29న మూసివేయనున్నారు. సాధారణంగా బాబ్లీ గేట్లు మూసివేసే సమయానికి ఏటా శ్రీరామసాగర్ లోకి కొంతమేర వరద ప్రవాహం కొనసాగేది. అయితే ఈ సీజన్‌లోనే ఈ నెల మొదటి వారంలో ప్రాజెక్టులోకి వరద ప్రవాహం పూర్తిగా నిలిచిపోయింది. బాబ్లీ గేట్లను మూసివేసిన అనంతరం తిరిగి 2027 జూలై 1న తెరవనున్నారు. అప్పటివరకు శ్రీరామసాగర్‌లోకి వరద నీరు వచ్చే అవకాశాలు తక్కువగా ఉండటంతో అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరం ఏర్పడింది.

గ్రావెల్ అనుమతులకు కొత్త ఆన్‌లైన్ విధానం

- **ఐదు రోజుల నుంచి వారంలోపు అనుమతులు..**
- **అక్రమ తవ్వకాలు, తరలింపునకు అడ్డుకట్ట**



ప్రజానావ, హనుమకొండ : గ్రావెల్ (కంకర మట్టి) తరలింపునకు సంబంధించిన అనుమతుల ప్రక్రియను సులభతరం చేసేందుకు సమగ్ర గ్రావెల్ నిర్వహణ విధానాన్ని అమల్లోకి తీసుకురానున్నట్లు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో నూతన ఆన్‌లైన్ పోర్టల్ రూపకల్పన, అమలుపై మైనింగ్, రెవెన్యూ, సాంకేతిక శాఖల అధికారులతో ఆమె సన్నాహక సమావేశం నిర్వహించారు. కొత్త పోర్టల్‌కు సంబంధించిన వివిధ అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్న మొత్తాల్లో గ్రావెల్ అవసరమైన సందర్భాల్లోనూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని త్వరితగతిన అనుమతులు పొందేలా నూతన విధానాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. రహదారుల నిర్మాణం, రైతులు, ప్రజల అవసరాలకు అనుగుణంగా గ్రావెల్ తరలింపు అనుమతుల ప్రక్రియను సులభతరం చేయడమే ఈ విధానం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి సాధ్యమైనంత త్వరగా, ఐదు రోజుల నుంచి వారంలోపు అనుమతులు మంజూరు చేసేలా వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. పోర్టల్ నిర్వహణకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) రూపొందించనుందని తెలిపారు. నూతన విధానంపై అవగాహన కల్పించేందుకు సీజీజీ సాంకేతిక బృందం శనివారం జిల్లాకు రానుందని, రెండు విడతల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు (గిర్దావర్లు), పంచాయతీ కార్యదర్శులకు విధివిధానాలను వివరించనున్నట్లు చెప్పారు. త్వరలోనే పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు గ్రావెల్ తరలించే వాహనాల వివరాలను నమోదు చేయడంతో పాటు, గ్రామంలోకి ప్రవేశించిన సమయం, బయటకు వెళ్లిన సమయాన్ని పోర్టల్‌లో పొందుపరుస్తారని వివరించారు. ఈ వ్యవస్థ అమల్లోకి వస్తే అనధికార గ్రావెల్ తవ్వకాలు, అక్రమ తరలింపునకు అడ్డుకట్ట వేయడంతో పాటు గ్రామాల్లో చిన్నపాటి పనులకు అవసరమైన గ్రావెల్‌ను పొందడం సులభతరం అవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా మైనింగ్ శాఖ సహాయ సంచాలకుడు రామాచారి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేశ్, డి.ఎస్. వెంకన్న, ఈ–డీఎం శ్రీధర్, సి–సెక్షన్ సూపరింటెండెంట్ చల్లా ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాపై అర్నబ్ తుఫాన్ ప్రభావం

- **చల్లని గాలులతో చిరుజల్లులు**
- **ఎండల నుంచి ఉపశమనం పొందిన ప్రజలు**

ప్రజానావ, ఆదిలాబాద్ : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాపై అర్నబ్ తుఫాన్ ప్రభావం కనిపిస్తోంది. అల్పపీడన ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకోగా, చల్లని గాలులతో కూడిన చిరు జల్లులు కురుస్తున్నాయి. ఆదిలాబాద్, మంచిర్యాల, కుమురం భీం జిల్లాల్లో రాత్రి నుంచి తేలికపాటి వర్షం పడుతోంది. ఆకాశం పూర్తిగా మేఘావృతమై చీకట్లు కమ్ముకోవడంతో వాతావరణం చల్లబడింది. కొంతకాలంగా ఎండల తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు వర్షం కాస్త ఉపశమనం కలిగిస్తోంది. మరోవైపు వర్షాలు లేక ఎండుముఖం పట్టిన పంటలకు ఈ చిరుజల్లులు కొంత ఊరటనిచ్చాయని రైతులు భావిస్తున్నారు. వర్షాలు కొనసాగితే పంటలకు మేలు జరుగుతుందని ఆశిస్తున్నారు.






ఉక్రెయిన్ రైల్వే స్టేషన్‌పై రష్యా డ్రోన్ దాడి

- 13 మంది మృతి
- ఐదుగురికి గాయాలు
- రైలు బయలుదేరేందుకు సిద్ధంగా ఉండగా దాడి

కీవ్ : ఉక్రెయిన్‌లోని దినిప్రో రైల్వే స్టేషన్‌పై రష్యా డ్రోన్ దాడి చేసినట్లు ఉక్రెయిన్ రైల్వే శాఖ వెల్లడించింది. ఈ ఘటనలో 13 మంది ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురు గాయపడ్డారు. దినిప్రో నుంచి జపోరిజియా నగరానికి ప్రయాణికుల రైలు బయలుదేరేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో ఈ దాడి జరిగినట్లు తెలిపింది. జెట్ ఇంజిన్‌తో నడిచే మానవరహిత వైమానిక వాహనం (యూఏవీ)తో స్టేషన్‌ను లక్ష్యంగా చేసుకున్నట్లు రైల్వే శాఖ తన టెలిగ్రామ్ ప్రకటనలో పేర్కొంది. దాడికి ముందు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, అప్పటికే ప్లాట్‌ఫామ్‌పై ప్రయాణికులు పెద్ద సంఖ్యలో ఉండటంతో ప్రాణనష్టం అధికంగా జరిగినట్లు సమాచారం. దాడి సమయంలో రైల్వే స్టేషన్ రద్దీగా ఉండటంతో పరిస్థితి తీవ్రంగా మారింది. ఘటనాస్థలిలో సహాయక బృందాలు, వైద్య సిబ్బంది, భద్రతా అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులకు చికిత్స అందించడంతోపాటు బాధితులకు అవసరమైన సాయం అందిస్తున్నారు. రైల్వే స్టేషన్‌లో పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉందని దినిప్రో మేయర్ బోరిస్ ఫిలటోవ్ తెలిపారు. ఈ దాడితో ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

అమెరికా అణు పరిశోధనా కేంద్రంలో అగ్నిప్రమాదం

- రేడియేషన్ లీకేజీపై ఆందోళన
- రెండు గంటల్లో మంటలు అదుపు
- ప్రజలకు ముప్పు లేదన్న అధికారులు



సౌత్ కరోలినా : అమెరికాలోని సౌత్ కరోలినా రాష్ట్రంలో అణు పరిశోధనా కేంద్రంలో అగ్నిప్రమాదం కలకలం రేపింది. అమెరికా ఇంధన శాఖకు చెందిన సవన్నా రివర్ నేషనల్ లేబొరేటరీలోని ఓ గదిలో మంటలు చెలరేగాయి. దీంతో రేడియోధార్మిక పదార్థాలు లీకై ఉండవచ్చన్న ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అప్రమత్తమైన అధికారులు ముందుజాగ్రత్త చర్యగా అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. అగ్నిమాపక సిబ్బంది సుమారు రెండు గంటల్లోనే మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదం జరిగిన భవనం వెలుపలికి రేడియోధార్మికత విడుదల కాలేదని అధికారులు వెల్లడించారు. రేడియోధార్మిక ప్రభావం ప్రయోగశాల ప్రాంగణానికే పరిమితమైందని, బయట ఉన్న ప్రజలకు ఎలాంటి ప్రమాదం లేదని స్పష్టం చేశారు. అయినప్పటికీ ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రయోగశాలకు వెళ్లే ప్రవేశ మార్గాలను మూసివేశారు. సమీప ప్రాంతాల్లో రాకపోకలను నిలిపివేశారు. పరిస్థితిని పూర్తిస్థాయిలో సమీక్షించిన అనంతరం ప్రయోగశాల మార్గాలను తిరిగి తెరిచి, రాకపోకలను పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపారు.

రూ.8.86 కోట్ల వంతెన.. మూడేళ్లుగా నిరుపయోగం

అప్రోచ్ రోడ్లు లేక 50 గ్రామాల ప్రజలకు రవాణా కష్టాలు



భోపాల్ : రూ.8.86 కోట్ల వ్యయంతో నిర్మించిన వంతెన అనుసంధాన రహదారులు లేక మూడేళ్లుగా నిరుపయోగంగా మారింది. మధ్యప్రదేశ్‌లోని నర్మదాపురం, నరసింగ్‌పూర్ జిల్లాల సరిహద్దులో ఉమర్ధా గ్రామం సమీపంలోని దుధి నదిపై ఈ వంతెనను నిర్మించారు. అయితే ఇరువైపులా అప్రోచ్ రోడ్లు వేయకపోవడంతో రెండు జిల్లాలకు చెందిన సుమారు 50 గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ భూముల మీదుగా గుంతలమయమైన దారుల్లో ప్రయాణించాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వెంటనే అనుసంధాన రహదారులు నిర్మించి రవాణా సౌకర్యాలను మెరుగుపరచాలని డిమాండ్ చేస్తున్నారు.

డబ్బు కోసం టెక్కీ, రూమ్‌మేట్ కిడ్నాప్

- మహిళ సహా 11 మంది అరెస్ట్
- అత్యాచారం ఆరోపణలతో ఇద్దరు టెక్కీలపైనా కేసు



బెంగళూరు : డబ్బు కోసం సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, అతడి రూమ్‌మేట్‌ను కిడ్నాప్ చేసిన ఘటన బెంగళూరులో కలకలం రేపింది. పోలీసులు ఆ ఇద్దరిని ఆరు గంటల్లోనే సురక్షితంగా రక్షించి, కిడ్నాప్‌కు పాల్పడిన 21 ఏళ్ల మహిళ సహా 11 మందిని అరెస్ట్ చేశారు. మరోవైపు, కిడ్నాప్ కేసులో బాధితురాలిగా ఉన్న మహిళ.. ఆ ఇద్దరు తనపై అత్యాచారానికి పాల్పడ్డారని ఫిర్యాదు చేయడంతో వారిపైనా పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 23 ఏళ్ల బి. మహేంద్ర బెంగళూరులోని ఓ ఐటీ సంస్థలో పనిచేస్తూ, తరుణ్ అనే యువకుడితో కలిసి మారతహళ్లిలో నివసిస్తున్నాడు. అక్టోబర్ 27న తెల్లవారుజామున వీరిద్దరిని కొందరు వ్యక్తులు కిడ్నాప్ చేశారు. మహేంద్ర తండ్రి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు సీసీటీవీ దృశ్యాలను పరిశీలించి నిందితులను గుర్తించారు. డబ్బు కోసమే కిడ్నాప్ చేసినట్లు నిందితులు అంగీకరించారని పోలీసులు తెలిపారు. కాగా, అక్టోబర్ 24న తెల్లవారుజామున మహేంద్ర, తరుణ్ తనపై అత్యాచారం చేశారని ఆరోపిస్తూ మహిళ ఫిర్యాదు చేయడంతో మారతహళ్లి పోలీసులు మరో కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం ఇద్దరు యువకులను కూడా అరెస్ట్ చేసినట్లు పోలీసు అధికారి వెల్లడించారు. కిడ్నాప్ కేసులో నిందితులను కోర్టులో హాజరుపరిచిన తర్వాత విచారణ నిమిత్తం కస్టడీలోకి తీసుకుంటామని తెలిపారు.



ఐర్లాండ్‌లో సంగక్కరకు చేదు అనుభవం

- ర్యాన్‌ఎయిర్ సిబ్బందిపై వివక్ష ఆరోపణలు
- కుటుంబంతో ఎదురైన ఘటనపై సోషల్ మీడియాలో మాజీ క్రికెటర్ ఆవేదన

డబ్లిన్ : శ్రీలంక మాజీ క్రికెటర్ కుమార సంగక్కరకు ఐర్లాండ్‌లో చేదు అనుభవం ఎదురైంది. తనతోపాటు కుటుంబ సభ్యుల పట్ల ర్యాన్ ఎయిర్ విమానయాన సంస్థ సిబ్బంది వివక్షపూరితంగా వ్యవహరించారని ఆయన ఆరోపించారు. డబ్లిన్ విమానాశ్రయంలోని ర్యాన్‌ఎయిర్ గేట్ సిబ్బంది తీరుపై సోషల్ మీడియా వేదికగా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తనకు, తన కుటుంబానికి ఇలాంటి పరిస్థితి ఎదురవడం ఇదే తొలిసారని పేర్కొన్నారు. ''డబ్లిన్‌లోని ర్యాన్‌ఎయిర్ గేట్ సిబ్బంది నుంచి మరెవరైనా వివక్షను ఎదుర్కొన్నారా? నాకు, నా కుటుంబానికి ఇప్పుడే ఇలాంటి అనుభవం ఎదురైంది. ఈ ఘటన నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. సిబ్బంది మాట్లాడిన తీరు, నిబంధనలను సరిగా పాటించకపోవడం, బెదిరింపులకు దిగినట్లుగా వ్యవహరించడం ఏ ప్రయాణికుడికీ ఆమోయోగ్యం కాదు. డబ్లిన్‌లో మాకు ఎదురైన తొలి చేదు అనుభవం ఇది'' అని సంగక్కర తన పోస్టులో పేర్కొన్నారు. ఈ పోస్టుపై సాఫ్ట్‌వేర్ సంస్థ డబ్ల్యూఎస్ఓ2 సీతమో సంజీవ స్పందిస్తూ.. పాశ్చాత్య దేశాల్లోనూ వివక్ష ఒక భాగంగా ఉందని వ్యాఖ్యానించారు. వివక్షను ఎదుర్కొన్నప్పుడు కలిగే అనుభవం ఎంతో బాధాకరంగా ఉంటుందని సంగక్కర బదులిచ్చారు. యూరప్‌లో అతిపెద్ద విమానయాన సంస్థల్లో ఒకటైన ర్యాన్‌ఎయిర్ సిబ్బంది వ్యవహారశైలిపై సంగక్కర చేసిన ఆరోపణలు చర్చకు దారితీశాయి. అయితే ఈ ఘటనపై సంస్థ వివరణ లేదా అధికారిక స్పందనకు సంబంధించిన వివరాలు వెల్లడికాలేదు.

సూపర్ ఎల్‌నినో ముప్పు!

- భారత్‌లో 55 వేల మరణాల అంచనా
- డిసెంబర్‌లో గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం
- 2027 ఆరంభం వరకు తీవ్ర వాతావరణ ప్రభావాలు
- వృద్ధులు, చిన్నారులు అప్రమత్తంగా ఉండాలంటున్న నిపుణులు



న్యూఢిల్లీ : ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులను ప్రభావితం చేస్తున్న ఎల్‌నినో ఇప్పుడు ఆందోళన కలిగిస్తోంది. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరుగుతుండటంతో తీవ్రమైన ఎండలు, కరువు, వరదలు, తుపానుల ముప్పు పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితిని కొన్ని అంచనాలు సూపర్ ఎల్‌నినోగా అభివర్ణిస్తున్నాయి. ఈ ప్రభావంతో వేడి సంబంధిత మరణాలు భారీగా పెరిగే ప్రమాదం ఉందని క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ రూపొందించిన మరణాల అంచనా వ్యవస్థ వెల్లడించింది. అక్టోబర్ నుంచి మార్చి మధ్య కాలంలో ఎల్‌నినో ప్రభావంతో భారత్‌లో సుమారు 55 వేల వేడి సంబంధిత మరణాలు సంభవించే అవకాశం ఉందని అంచనా వేసింది. వీటిలో అత్యధిక మరణాలు మార్చిలో నమోదయ్యే ప్రమాదం ఉందని పేర్కొంది. అయితే ఇవి ముందస్తు అంచనాలు మాత్రమేనని, వాస్తవ మరణాల సంఖ్యగా భావించరాదని స్పష్టం చేసింది. నైజీరియాలో సుమారు 56 వేల మంది, ఇండోనేషియాలో 29 వేల మంది, బ్రెజిల్‌లో 19 వేల మంది వేడి ప్రభావంతో మరణించే అవకాశం ఉందని అంచనాలు వెల్లడిస్తున్నాయి. ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో తీవ్ర ఉష్ణోగ్రతలు ప్రజల ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపవచ్చో ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. సఫార్ వ్యవస్థాపకుడు, ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ గుఫ్రాన్ బేగ్ అభిప్రాయం ప్రకారం.. ముంబై వంటి నగరాల్లో గాలుల వేగం తగ్గితే వేడిని బయటకు తీసుకెళ్లే సహజ ప్రక్రియ బలహీనపడుతుంది. దీంతో నగరాల్లో ఉష్ణోగ్రతల ప్రభావం మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో భవనాలు, రహదారుల కారణంగా వేడి ఎక్కువగా నిలిచిపోయే పరిస్థితి, అధిక జనసాంద్రత, గాలి ప్రసరణలో మార్పులు ప్రజల ఆరోగ్యంపై అదనపు ఒత్తిడిని కలిగించవచ్చు.

డిసెంబర్‌లో గరిష్ఠానికి ఎల్‌నినో?

ప్రపంచ వాతావరణ సంస్థ అంచనాల ప్రకారం.. ఎల్‌నినో ప్రభావం డిసెంబర్‌లో గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉంది. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవడంతో పాటు వర్షపాతం తీరులోనూ మార్పులు చోటుచేసుకోవచ్చని హెచ్చరిస్తోంది. ఫలితంగా కొన్ని ప్రాంతాల్లో కరువు, మరికొన్ని ప్రాంతాల్లో వరదల ముప్పు పెరిగే అవకాశం ఉంది. ఈ ప్రభావాలు 2027 ఆరంభం వరకు కొనసాగవచ్చని అంచనా వేస్తున్నారు. మధ్య, తూర్పు భూమధ్య రేఖ పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే పెరిగినప్పుడు ఎల్‌నినో ఏర్పడుతుంది. ఈ వాతావరణ పరిణామం గాలుల దిశ, వాతావరణ పీడనం, వర్షపాతం పంపిణీలో మార్పులకు కారణమవుతుంది. సాధారణంగా ప్రతి రెండు నుంచి ఏడేళ్లకు ఒకసారి ఏర్పడే ఈ పరిస్థితి సుమారు తొమ్మిది నుంచి పన్నెండు నెలల పాటు కొనసాగవచ్చు. దీనికి వ్యతిరేక దశను లానినా అంటారు. ఉష్ణోగ్రతలు పెరిగే ప్రమాదం నేపథ్యంలో ప్రజలు వాతావరణ శాఖ సూచనలను పాటించాలని, తగినంత నీరు తాగాలని, తీవ్ర ఎండ సమయంలో బయట తిరగడాన్ని తగ్గించాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, ఎండలో పనిచేసేవారు వేడి ఒత్తిడికి గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉన్నందున ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

స్పెయిన్ రైలు ప్రమాదంలో సిగ్నలింగ్ వైఫల్యమే కారణమా?

- కంట్రోల్ సెంటర్ సంభాషణల ఆడియో విడుదల
- మృతుల సంఖ్య 69కి పెరుగుదల
- మూడు రోజుల పాటు జాతీయ సంతాప దినాలు



మాడ్రిడ్ : స్పెయిన్‌లో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో మృతుల సంఖ్య 69కి చేరింది. ఈ దుర్ఘటనకు సంబంధించి కీలక వివరాలు వెలుగులోకి వస్తున్నాయి. రైలు డ్రైవర్లు, మాడ్రిడ్‌లోని రైల్వే నియంత్రణ కేంద్రం మధ్య జరిగిన సంభాషణలకు సంబంధించిన ఆడియో రికార్డులను అధికారులు విడుదల చేశారు. మాడ్రిడ్ నుంచి సెవిల్లె వెళ్లే మార్గంలో ఆగి ఉన్న రైలును వెనుక నుంచి మరో రైలు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఒకే మార్గంలో ముందు వెళ్తున్న రైలు నిలిచిపోయినప్పుడు, వెనుక వస్తున్న రైలుకు ప్రయాణించేందుకు అనుమతి ఎలా ఇచ్చారనే అంశంపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ఘటన నేపథ్యంలో స్పెయిన్‌లో మూడు రోజుల పాటు సంతాప దినాలు ప్రకటించారు. స్పానిష్ మీడియా కథనాల ప్రకారం.. సాంకేతిక సమస్య కారణంగా ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ దెబ్బతి నడంతో ఆ మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో కొన్ని రైళ్లను మధ్యలోనే నిలిపివేశారు. ప్రమాదానికి గురైన రైళ్లలో ఒకటి ప్రైవేటు సంస్థ ఇరియోకు చెందినది కాగా, మరోటి ప్రభుత్వ రైల్వే సంస్థ రెనిఫ్‌కు చెందినది. సిగ్నలింగ్ వ్యవస్థలో సమస్య తలెత్తినప్పటికీ, వెనుక నుంచి వస్తున్న రెనిఫ్ రైలుకు వేగ పరిమితులు విధించ లేదని ఆడియో రికార్డుల ద్వారా తెలుస్తున్నట్లు కథనాలు పేర్కొన్నాయి. సాంకేతిక సమస్యలు ఉన్నప్పటికీ సాధారణ వేగం తోనే ప్రయాణించాలని రైల్వే నియంత్రణ కేంద్రం నుంచి రెనిఫ్ రైలు డ్రైవర్‌కు సూచనలు వెళ్లినట్లు సమాచారం. మరోవైపు, ముందు ఆగిపోయిన ఇరియో రైలుకు నియంత్రణ కేంద్రంతో సంబంధాలు తెగిపోయాయి. దాని నియంత్రణ వ్యవస్థ కూడా పనిచేయకపోవడంతో ఉర్దా గ్రామం వద్ద రైలు నిలిచిపోయింది. రైలులోని భద్రతా వ్యవస్థలో సమస్యలున్నాయని ఇరియో రైలు డ్రైవర్ నియంత్రణ కేంద్రానికి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఇరియో రైలు నిలిచిపోయిన విషయం నియంత్రణ కేంద్రానికి తెలిసినప్పటికీ, వెనుక నుంచి వస్తున్న రెనిఫ్ రైలుకు ఆ సమాచారం చేరలేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సిగ్నలింగ్ వైఫల్యం, సమాచార మార్పిడిలో లోపాలు, నియంత్రణ కేంద్రం తీసుకున్న నిర్ణయాలు ప్రమాదానికి కారణమయ్యాయా అనే కోణాల్లో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద సమయంలో రెనిఫ్ రైలులో 397 మంది, ఇరియో రైలులో 147 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. మృతులను గుర్తించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బాధితుల కుటుంబ సభ్యులు డీఎన్ఏ నమూనాలు అందించాలని అధికారులు కోరారు. సహాయక చర్యల్లో సుమారు 900 మంది పాల్గొన్నట్లు వెల్లడించారు. క్షతగాత్రులకు చికిత్స అందించేందుకు అవసరమైన రక్త నిల్వలను సమకూర్చేందుకు ప్రజలు రక్తదానం చేయాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ ఘోర ప్రమాదంతో దేశమంతా విషాదంలో మునిగిపోయిందని స్పెయిన్ ప్రధాని సాంచెజ్ పేర్కొన్నారు.

తేని సబ్‌జైలు నుంచి 17 మంది ఖైదీల పరారీ


- మూడు గంటల్లోనే పథకం అమలు
- సిబ్బందిపై వంట సామగ్రితో దాడి
- 48 గంటల్లోనే పట్టుకున్న అధికారులు



తేని : తమిళనాడులోని తేని జిల్లా సబ్‌జైలు నుంచి 17 మంది ఖైదీలు పరారైన ఘటనలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. బెయిల్ పిటిషన్లు తిరస్కరణకు గురికావడంతో ఆగ్రహానికి గురైన ఖైదీలు అప్పటికప్పుడు పరారీకి పథకం వేసుకున్నట్లు దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. సోమవారం సాయంత్రం 7 గంటల సమయంలో ప్రారంభమైన ఈ కుట్రను కేవలం మూడు గంటల్లోనే, రాత్రి 10 గంటలకు అమలు చేసినట్లు గుర్తించారు. మదురైకి చెందిన 26 ఏళ్ల లింగ ప్రసాత్ ఈ పథకానికి సూత్రధారిగా వ్యవహరించగా, దోపిడీ కేసులో జైలులో ఉన్న మరో 26 ఏళ్ల ముత్తు ఎలాంగోవన్ దానిని అమలు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఖైదీల్లో ఒకరు మూర్ఛ వచ్చినట్లు నటిస్తే, సిబ్బంది జైలు గది తలుపులు తెరిచిన సమయంలో మిగతావారంతా ఒక్కసారిగా దాడిచేసి పారిపోవచ్చని లింగ ప్రసాత్ ప్రణాళిక రూపొందించాడు. అందులో భాగంగా ఎలాంగోవన్ మూర్ఛ వచ్చినట్లు కిందపడి కొట్టుకోవడంతో జైలు సిబ్బంది తలుపులు తెరిచి, చికిత్స కోసం అతడిని బయటకు తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. ఇదే అదనుగా భావించిన 17 మంది ఖైదీలు వంట సామగ్రితో సిబ్బందిపై దాడిచేసి పరారయ్యారు. ప్రధాన ద్వారం వద్ద ఉన్న భద్రతా సిబ్బంది వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా, వారిపైనా దాడిచేసి జైలు ప్రాంగణం నుంచి బయటపడ్డారు. పరారీ కుట్రకు సూత్రధారిగా గుర్తించిన లింగ ప్రసాత్‌పై వ్యవస్థీకృత నేరాలు, దోపిడీలు, దొంగిలించిన ఆస్తులను కలిగి ఉండటం, వాటిని విక్రయించడం వంటి కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. పరారైన 17 మందిని 48 గంటల్లోనే అరెస్టు చేసి తిరిగి జైలుకు తరలించారు. ప్రస్తుతం వారిని విచారిస్తూ పరారీకి సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు. ఘటన జరిగిన జైలు విభాగంలో మొత్తం 32 మంది ఖైదీలు ఉండగా, వారిలో 17 మంది పారిపోయారు. మిగిలిన 15 మంది ఖైదీల పాత్రపైనా అధికారులు దృష్టి సారించారు. పరారైన వారికి వారు ఏమైనా సహకరించారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. అందుబాటులో ఉన్న ఆధారాల ప్రకారం, ఈ ఘటన ముందుగానే పక్కాగా రూపొందించిన ప్రణాళిక ప్రకారం కాకుండా, ఆ సాయంత్రం ఖైదీల మధ్య జరిగిన చర్చల సందర్భంగా అప్పటికప్పుడు నిర్ణయించుకున్న చర్యగా అధికారులు భావిస్తున్నారు. ఖైదీలు తమ చర్యలను ఎలా సమన్వయం చేసుకున్నారు, జైలు ప్రాంగణంలోని భద్రతా లోపాలను ఎలా ఉపయోగించుకున్నారు అనే అంశాలపై విచారణ కొనసాగుతోంది. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలతో తొమ్మిది మంది జైలు సిబ్బందిని అధికారులు సస్పెండ్ చేశారు. ఈ ఘటన నేపథ్యంలో తమిళనాడు జైళ్ల శాఖ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జైళ్లలో భద్రతా తనిఖీలు చేపట్టింది. జైళ్లలోని భద్రతా లోపాలను గుర్తించి, ఈ నెలాఖరులోగా సమగ్ర విశ్లేషణ నిర్వహించేందుకు చర్యలు చేపడుతోంది.

ఇజ్రాయెల్‌లో హంగ్ దిశగా ఎన్నికల ఫలితాలు

- నెతన్యాహూ కూటమికి 53 స్థానాలే
- ప్రతిపక్ష కూటమికి 48 సీట్లు
- అరబ్ పార్టీల మద్దతుతో ప్రభుత్వ ఏర్పాటుపై ఉత్కంఠ



జెరూసలెం : ఇజ్రాయెల్ ఎన్నికల పాక్షిక ఓట్ల లెక్కింపులో ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సారథ్యంలోని కూటమికి 53 స్థానాలు, మాజీ సైనిక అధిపతి గాడి ఐసెన్‌కోట్ నేతృత్వంలోని ప్రతిపక్ష కూటమికి 48 స్థానాలు లభించాయి. దీంతో నెతన్యాహు కూటమి పార్లమెంటులో మెజారిటీకి దూరంగా నిలిచింది. అరబ్ నేతృత్వంలోని పార్టీలు 19 స్థానాలు గెలుచుకునే అవకాశం ఉండటంతో తదుపరి ప్రభుత్వం ఏర్పాటుపై ఉత్కంఠ నెలకొంది. కేంద్ర ఎన్నికల కమిటీని ఉటంకిస్తూ స్థానిక మీడియా వెల్లడించిన వివరాల ప్రకారం సాధారణ ఓట్లలో 91 శాతం లెక్కింపు పూర్తయింది. ఇది మొత్తం ఓట్లలో 85.6 శాతానికి సమానం. ఇజ్రాయెల్ పార్లమెంటు నెసెట్‌లో మొత్తం 120 స్థానాలు ఉండగా, ప్రభుత్వ ఏర్పాటుకు కనీసం 61 మంది సభ్యుల మద్దతు అవసరం. ప్రస్తుత లెక్కల ప్రకారం ఐసెన్‌కోట్ కూటమి, అరబ్ నేతృత్వంలోని పార్టీల స్థానాలను కలిపితే 67 అవుతున్నాయి. ఈ పార్టీలు తమ రాజకీయ విభేదాలను పక్కనపెట్టి ఏకాభిప్రాయానికి వస్తే ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మద్దతు లభించే అవకాశం ఉంది. అయితే అటువంటి ప్రభుత్వం ఏర్పడటంపై స్పష్టత లేదు. అరబ్ పార్టీల మద్దతుపై ఆధారపడటాన్ని నెతన్యాహు వ్యతిరేకిస్తుండగా, ప్రతిపక్ష నేతల్లోనూ ఆ పార్టీలను సంకీర్ణంలో భాగస్వాములుగా చేర్చుకోవాలా, బయట నుంచి మద్దతు తీసుకోవాలా అనే అంశంపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. మరోవైపు మిగిలిన సాధారణ బ్యాలెట్లలో ఏడు శాతానికి అదనపు పర్యవేక్షణ అవసరమని ఎన్నికల కమిటీ తెలిపింది. సుమారు ఆరు లక్షల ద్వంద్వ కవర్లలో ఉన్న బ్యాలెట్లను కూడా లెక్కించాల్సి ఉందని స్థానిక మీడియా వెల్లడించింది. చెల్లుబాటయ్యే ఓట్లలో 3.25 శాతంగా నిర్ణయించిన కనీస ఓట్ల పరిమితిని రిజర్వ్‌స్ట్ పార్టీ 2.6 శాతం, పీపుల్ ఆఫ్ ఇజ్రాయెల్ పార్టీ 1.6 శాతం, హరేదీ పబ్లిక్ పార్టీ 0.2 శాతంతో అందుకోలేకపోయాయి. అయితే ఓట్ల లెక్కింపు పూర్తయ్యే నాటికి ఈ పార్టీల ఓట్ల శాతాల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. ప్రధాన ప్రసార సంస్థలు వెల్లడించిన ఎగ్జిట్ పోల్స్ అంచనాల ప్రకారం నెతన్యాహు కూటమికి 50 నుంచి 52 స్థానాలు, ప్రతిపక్ష కూటమికి 51 నుంచి 53 స్థానాలు లభించే అవకాశముంది. అరబ్ నేతృత్వంలోని పార్టీలు 17 నుంచి 18 స్థానాలు గెలుచుకోవచ్చని అంచనా వేశాయి. నెతన్యాహుకు చెందిన లికుడ్ పార్టీ అతిపెద్ద పార్టీగా అవతరించే సూచనలు కనిపిస్తున్నప్పటికీ, ఆయన నేతృత్వంలోని కూటమికి మాత్రం ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ దక్కలేదు. దీంతో తుది ఫలితాలు, అరబ్ పార్టీల వైఖరి ఇజ్రాయెల్‌లో తదుపరి ప్రభుత్వ ఏర్పాటును నిర్ణయించనున్నాయి.

ఇజ్రాయెల్ ఎన్నికల్లో విదేశీ జోక్యం?

ఇజ్రాయెల్ సార్వత్రిక ఎన్నికల్లో విదేశీ జోక్యం జరిగిందని ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ఆరోపించారు. ఖతార్ నుంచి అరబ్ ఓటర్లకు డబ్బులు అందినట్లు తమ లికుడ్ పార్టీ అనుమానిస్తోందని వెల్లడించారు. ఈ వ్యవహారంపై ఇజ్రాయెల్ నిఘా సంస్థ షిన్‌బెట్ దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నిఘా సంస్థకు అందిన సమాచారం ఆధారంగా విదేశీ జోక్యం కోణంలో విచారణ కొనసాగనున్నట్లు తెలిపారు. తాజా ఎన్నికల్లో నెతన్యాహూకు చెందిన లికుడ్ పార్టీకి 53 సీట్లు, ప్రతిపక్ష యాషర్ పార్టీకి 48 సీట్లు దక్కినట్లు సమాచారం. అరబ్ స్థానాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు ఇంకా కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత ఫలితాల ప్రకారం నెతన్యాహూ పార్టీకి ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ లభించలేదు. ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే మరో ఎనిమిది సీట్లు అవసరమని తాజా సమాచారం వెల్లడిస్తోంది. ఈ నేపథ్యంలో అరబ్ ఓట్ల ఫలితాలు నెతన్యాహూ రాజకీయ భవితవ్యాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంది. అరబ్ ఓటర్లను ఆకర్షించేందుకు ఖతార్ నుంచి డబ్బులు పంపించారని లికుడ్ పార్టీ ఆరోపించింది. అయితే అరబ్ పార్టీలు ఎన్నికలను తారుమారు చేశాయంటూ వస్తున్న ఆరోపణలను పోలీసులు ఖండించారు. ఈ ఆరోపణలకు ఆధారాలు లేవని స్పష్టం చేశారు.



కర్ణాటకలో కోటి ఓట్ల తొలగింపునకు మంత్రి సమర్థన

- నిబంధనల ప్రకారమే సవరణలు
- ఇతర రాష్ట్రాల్లో అమలుపైనే అభ్యంతరాలు

బెంగళూరు : కర్ణాటకలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా దాదాపు కోటి ఓట్ల తొలగింపును రాష్ట్ర మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత సతీశ్ జర్కిహోళి సమర్థించారు. మరణించినవారు, వలస వెళ్లినవారు, రెండుచోట్ల ఓటు కలిగినవారి పేర్లనే నిబంధనల ప్రకారం తొలగించారని తెలిపారు. ఈ ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు జరగలేదని, అర్హులైన ఓటర్ల హక్కులకు భంగం కలగలేదని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ అభ్యంతరాలు కర్ణాటకకు సంబంధించినవి కావని, బిహార్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రల్లో అమలు చేసిన తీరుపైనే తమకు అభ్యంతరాలున్నాయని చెప్పారు. కర్ణాటకలో సిబ్బందికి శిక్షణ, ముందస్తు సమాచారం అందించడం వల్ల ప్రక్రియ పారదర్శకంగా సాగిందని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రక్షాళన మంచిదేనని, అయితే దాని అమలు విధానం సక్రమంగా ఉండాలని అన్నారు.

ముంబై కెప్టెన్ ఎవరు!

యాజమాన్యం రోహిత్ వైపా.. తిలక్ వైపా?

• 2027 సీజన్‌కు అనుభవజ్ఞుడికే పగ్గాలు అప్పగించే యోచన • దీర్ఘకాల నాయకుడిగా తిలక్‌ను తీర్చిదిద్దే అవకాశం



న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ముంబై ఇండియన్స్ జట్టు.. 2027 సీజన్ కోసం కెప్టెన్సీ విషయంలో కీలక నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో అనుభవజ్ఞుడైన రోహిత్ శర్మకు మరోసారి పగ్గాలు అప్పగించాలా? లేక భారత టీ20 వైస్ కెప్టెన్ తిలక్ వర్మను దీర్ఘకాల నాయకుడిగా తీర్చిదిద్దాలా? అనే ప్రశ్న జట్టు యాజమాన్యాన్ని వేధిస్తోంది. కోచింగ్ బృందంలో సమూల మార్పులు చేసిన నేపథ్యంలో ఈ నిర్ణయంపై ఆసక్తి నెలకొంది. వచ్చే ఐపీఎల్ సీజన్ మధ్యలో రోహిత్ 40 ఏళ్లకు చేరుకుంటాడు. 2027 వన్డే ప్రపంచకప్ కోసం సిద్ధమవుతున్న అతడికి ఐపీఎల్‌లో ముంబై తరఫున ఆటగాడిగా అదే చివరి సీజన్ కావచ్చనే అంచనాలున్నాయి. మైదానంలో వ్యూహ రచన, నాయకత్వంలో రోహిత్‌కు ఇప్పటికీ సాటిలేరని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం జట్టులో పెద్దగా మార్పులు చేయాల్సిన అవసరం లేకపోవడంతో.. వచ్చే సీజన్‌కు అతడే సరైన నాయకుడనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రోహిత్ కెప్టెన్ అయితే మ్యాచ్ పరిస్థితులకు అనుగుణంగా ఇంపాక్ట్ ప్లేయర్‌ను ఉపయోగించుకునే వెసులుబాటు ఉంటుంది.

తిలక్‌కు దీర్ఘకాల బాధ్యతలు?

భవిష్యత్తు నాయకుడిగా తిలక్ వర్మను ముంబై ఇండియన్స్ పరిగణిస్తోంది. జట్టుతో మొదటి నుంచీ అనుబంధం ఉన్న అతడికి వచ్చే సీజన్‌లో నాయకత్వ బాధ్యతల్లో అనుభవం కల్పించి, ఆ తర్వాత దీర్ఘకాల కెప్టెన్‌గా నియమించే అవకాశముంది. 2027 సీజన్ తర్వాత మెగా వేలం జరగనుండటంతో కొత్త జట్టును నిర్మించే సమయంలో నాయకుడిగా తన అభిప్రాయాలను అమలు చేసే అవకాశం లభించవచ్చు.

పోలార్డ్‌తో రోహిత్‌కు అనుబంధం

ముంబై ఐదు ఐపీఎల్ టైటిళ్లు సాధించినప్పుడు రోహిత్‌కు కీరన్ పోలార్డ్ కీలక సహచరుడిగా ఉన్నాడు. ప్రస్తుతం ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన పోలార్డ్‌కు రోహిత్ నాయకత్వ శైలి, వ్యూహాలపై పూర్తి అవగాహన ఉంది. క్లిష్ట పరిస్థితుల్లోనూ జట్టును విజయాల బాట పట్టించిన ఈ ఇద్దరి అనుబంధం రోహిత్‌కు మరో అవకాశం కల్పించవచ్చని భావిస్తున్నారు. యాజమాన్యం తుది నిర్ణయం తీసుకోనుంది.

హార్దిక్ ట్రేడ్‌పై ఉత్కంఠ

గత మూడు సీజన్లుగా ముంబై కెప్టెన్‌గా ఉన్న హార్దిక్ పాండ్యా భవిష్యత్తుపైనా సందిగ్ధత కొనసాగుతోంది. అతడిని మరో జట్టుకు బదిలీ చేసే అవకాశం ఉందని ఐపీఎల్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే, సరైన ట్రేడ్ ప్రతిపాదన రాకపోతే హార్దిక్ ముంబయిలోనే కొనసాగి తన పూర్తి సామర్థ్యంతో ఆడతాడని ఓ ఐపీఎల్ వర్గం తెలిపింది. ట్రేడ్‌పై తుది నిర్ణయం జట్టు యాజమాన్యమే తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది.




డబ్ల్యూపీఎల్‌లో మరిన్ని జట్లు

• వచ్చే ఏడాది నుంచి విస్తరణపై బీసీసీఐ చర్చలు
• ఆటగాళ్లు, కోచ్‌లు, ఇతర భాగస్వాముల అభిప్రాయాలకూ ప్రాధాన్యం

కొచ్చి: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో జట్ల సంఖ్యను పెంచే అంశాన్ని వచ్చే ఏడాది నుంచి పరిశీలిస్తామని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు. లీగ్ వేలం సందర్భంగా బుధవారం మాట్లాడుతూ.. జట్ల విస్తరణతోపాటు ఇతర అంశాల్లోనూ మెరుగుదల కోసం చర్చలు జరుపుతామని చెప్పారు. ఆటగాళ్లు, కోచ్‌లు, సెలెక్టర్లు, ఇతర భాగస్వాముల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. 2023లో ప్రారంభమైన డబ్ల్యూపీఎల్ నాలుగేళ్లలో గణనీయమైన ప్రగతి సాధించిందని, ఐపీఎల్ తర్వాత ఫ్రాంచైజీ క్రికెట్‌లో కీలక లీగ్‌గా ఎదిగిందని సైకియా పేర్కొన్నారు. భారత మహిళల క్రికెట్ విజయాల్లోనూ ఈ లీగ్ ముఖ్య పాత్ర పోషిస్తోందన్నారు.

సింధు, మీరాబాయి నామినేషన్లు ఆమోదం

• అథ్లెట్ల కమిషన్ ఎన్నికల బరిలో 12 మంది క్రీడాకారులు
• నవంబరు 3న ఎన్నికలు.. ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళల ఎంపిక





న్యూఢిల్లీ: భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అథ్లెట్ల కమిష న్ ఎన్నికలకు బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు, వెయిటలిఫ్టర్ మీరాబాయి చాను సహా 12 మంది క్రీడాకారుల నామినేషన్లు చెల్లుబాటైనట్లు ఎన్నికల అధికారి సంజయ్ కె. శ్రీవాస్తవ గురువారం ప్రకటించారు. 2026–2030 కాలానికి ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలను ఎన్నుకునేందుకు నవంబరు 3న ఎన్నికలు జరగనున్నాయి. హాకీ కెప్టెన్లు హర్మన్‌ప్రీత్ సింగ్, సలీమా టెటె, షూటర్ స్వప్నిల్ కుశాలే, ఫెన్సర్ భవానీ దేవి, అథ్లెట్లు సుధా సింగ్, తజిందర్‌పాల్ సింగ్, మాజీ ఆర్చర్ బొంబేలా దేవి, బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిదాంబి శ్రీకాంత్, స్విమ్మర్ సాజన్ ప్రకాశ్, కయాకింగ్ అథ్లెట్ మంజీత్ సింగ్ పోటీలో ఉన్నారు. సింధు, మీరాబాయి, భవానీ దేవి ప్రస్తుత కమిషన్‌లోనూ సభ్యులుగా ఉన్నారు. దీనికి మేరీకోమ్ నేతృత్వం వహిస్తు న్నారు.

34 మంది ఓటర్లు

17 జాతీయ క్రీడా సమాఖ్యల నుంచి ఇద్దరు చొప్పున మొత్తం 34మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో పాల్గొంటారు. అయితే ఫుట్‌బాల్, టెన్నిస్, బాక్సింగ్, టేబుల్ టెన్నిస్ సమాఖ్యలకు ప్రాతినిధ్యం లేదు. అథ్లెట్ల కమిషన్లు ఏర్పాటు చేసుకున్న సమాఖ్యలే తమ ప్రతినిధులను నియమించేందుకు అర్హులని ఐఓఏ నిబంధనలు పేర్కొంటున్నాయి. ఎన్నికైన పది మందిలో ఒక పురుషుడు, ఒక మహిళ ఐఓఏ కార్యనిర్వాహక మండలిలో సభ్యులవుతారు. ఆరుగురు గత మూడు ఒలింపిక్స్‌లో కనీసం ఒకదానిలో పాల్గొని ఉండాలి. మిగిలిన నలుగురు గత మూడు ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడలు, ప్రపంచ ఛాంపియన్‌షిప్ లేదా జాతీయ క్రీడల్లో కనీసం ఒక పతకం సాధించి ఉండాలి.

ప్రమాణిక్ సంచలనం.. బెంగాల్ విజయం

• రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్–సీ మ్యాచ్‌లో కేరళ చిత్తు
• షాబాజ్ అహ్మద్ ఆల్‌రౌండ్ షో
• హ్యాట్రిక్ విజయాలతో అగ్రస్థానం



మంగళపురం: రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్–సీ మ్యాచ్‌లో బెంగాల్ 287 పరుగుల భారీ తేడాతో కేరళను ఓడించింది. స్పిన్నర్ ప్రదీప్త ప్రమాణిక్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో తొలిసారి ఒక మ్యాచ్‌లో పది వికెట్లు పడగొట్టగా, షాబాజ్ అహ్మద్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టు విజయాన్ని ఖాయం చేశాడు. 408 పరుగుల లక్ష్య ఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 53/4తో నాలుగో రోజు ఆట కొనసాగించిన కేరళ.. 38.4 ఓవర్లలో 120 పరుగులకే ఆలౌటైంది. ఈ సీజన్‌లో వరుసగా మూడో విజయంతో బెంగాల్ 18 పాయింట్లతో అగ్రస్థానాన్ని పటిష్ఠం చేసుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో 4/44, రెండో ఇన్నింగ్స్‌లో 6/51తో ప్రమాణిక్ మొత్తం పది వికెట్లు పడగొట్టాడు. మహమ్మద్ షమీ కీలక వికెట్లు తీయడంతో కేరళ 70 పరుగులకే ఎనిమిది వికెట్లు కోల్పోయింది. మహమ్మద్ అజరుద్దీన్ (26), ఎండీ నిధీష్ (33) ప్రతిఘటించినా షాబాజ్ ఇద్దరినీ ఔట్‌చేసి బెంగాల్‌కు విజయాన్ని అందించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 121 పరుగులు చేసిన షాబాజ్.. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 4 వికెట్లు తీశాడు. అతడికి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. బెంగాల్ తొలి ఇన్నింగ్స్‌లో 350, రెండో ఇన్నింగ్స్‌లో 198 పరుగులు చేయగా.. కేరళ 141 పరుగులకే పరిమితమైంది.

డ్రాగా ముగిసిన పలు మ్యాచ్‌లు

గుజరాత్–మహారాష్ట్ర మ్యాచ్ డ్రాగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో మహారాష్ట్ర 330 పరుగులు చేయగా, గుజరాత్ రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్లకు 446 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఆర్య దేశాయ్ (151), జయ్మీత్ పటేల్ (నాటౌట్ 119) రాణించారు. లక్ష్య ఛేదనలో మహారాష్ట్ర 141/4తో నిలిచింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో మహారాష్ట్రకు మూడు, గుజరాత్‌కు ఒక పాయింట్ లభించాయి. తుపాను ప్రభావంతో ఢిల్లీ–జార్ఖండ్, ఒడిశా–సర్వీసెస్ మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. ఢిల్లీ కెప్టెన్ ఆయుష్ బాదోని 210 పరుగులతో అజేయంగా నిలవడంతో ఢిల్లీ 5 వికెట్లకు 515 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ద్విశతకం సాధించిన బాదోనికి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. జార్ఖండ్ 131/4తో నిలిచింది.



బహ్రోమ్ వకీల్‌కు ట్రెంట్ పగ్గాలు

• నవంబర్ 11న చైర్మన్‌గా పదవీ విరమణ చేయనున్న నోయల్ టాటా
• చైర్మన్ ఎమెరిటస్‌గా నూతన బాధ్యతలు



న్యూఢిల్లీ: టాటా గ్రూప్ రిటైల్ సంస్థ ట్రెంట్ (టాటా రిటైల్ ఎంటర్‌ప్రైస్) లిమిటెడ్ చైర్మన్‌గా బహ్రోమ్ వకీల్‌ నియమితులయ్యారు. ప్రస్తుత చైర్మన్‌గా ఉన్న నోయల్ టాటా నవంబర్ 11న పదవీ విరమణ చేయనుండగా, నవంబర్ 12 నుంచి వకీల్ బాధ్యతలు చేపట్టనున్నారు. 1997 నుంచి సంస్థతో అనుబంధం కలిగిన నోయల్ టాటా సేవలను గుర్తిస్తూ, ఆయనను చైర్మన్ ఎమెరిటస్‌గా నియమించాలని బోర్డు నిర్ణయించింది. టాటా గ్రూప్ పాలన మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ నాయకత్వ మార్పు చేపట్టినట్లు సంస్థ తెలిపింది. సంస్థ వృద్ధికి, మార్కెట్‌లో స్థానం బలోపేతానికి నోయల్ టాటా కీలక పాత్ర పోషించారని పేర్కొంది. ఆయన ప్రస్తుతం టాటా ట్రస్ట్స్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు.

బోర్డులో కొత్త నియామకాలు

రాజీవ్ దూబేను అక్టోబర్ 30 నుంచి అదనపు నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. వాటాదారుల ఆమోదానికి లోబడి ఈ నియామకం అమలుకానుంది. కల్పనా మర్చంట్‌ను అదే తేదీ నుంచి మూడేళ్ల కాలానికి అదనపు స్వతంత్ర డైరెక్టర్‌గా నియమించింది. ఇదిలాఉంటే వెస్ట్‌సైడ్, జూడియో బ్రాండ్లతో ఫ్యాషన్ రిటైల్ వ్యాపారాన్ని, స్టార్ బ్రాండ్‌తో ఆహార, కిరాణా వ్యాపారాన్ని విస్తరిస్తున్న ట్రెంట్.. సెప్టెంబర్ త్రైమాసికంలో మెరుగైన ఫలితాలు నమోదు చేసింది. సంస్థ ఏకీకృత నికర లాభం గతేడాదితో పోలిస్తే 25 శాతం పెరిగి రూ.468 కోట్లకు చేరింది. ఆదాయం 22శాతం వృద్ధితో రూ.5,873 కోట్లుగా నమోదైంది.

కొనుగోళ్లతో కళకళ

• భారీ లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు
• దూసుకెళ్లిన సెన్సెక్స్, నిఫ్టీ 238 • బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ, ఐటీ రంగాల్లో జోరు



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ లాభాలతో ముగిశాయి. బ్యాంకింగ్, ఐటీ, ఎఫ్ఎంసీజీ షేర్లలో కొనుగోళ్లు, ముడిచమురు ధరల తగ్గుదల, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల పెంపునకు విరామం ఇవ్వడం మదుపర్లలో ఉత్సాహాన్ని పెంచాయి. సెన్సెక్స్ 905.01 పాయింట్లు (1.24 శాతం) పెరిగి 74,151.04 వద్ద, నిఫ్టీ 237.90 పాయింట్లు (1.05 శాతం) లాభంతో 22,936.75 వద్ద ముగిశాయి. సెన్సెక్స్‌లోని 30 షేర్లలో 26 లాభపడ్డాయి. సెప్టెంబర్ త్రైమాసికంలో నికర లాభం 18 శాతం పెరిగి రూ.3,682.44 కోట్లకు చేరడంతో అదానీ పోర్ట్స్ 5 శాతానికి పైగా ఎగబాకింది. కోటక్ బ్యాంక్, పవర్‌గ్రిడ్, ఎటర్నల్, బజాజ్ ఫైనాన్స్, ఎస్‌బీఐ, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు కూడా లాభపడ్డాయి. ట్రెంట్, మారుతీ సుజుకీ, టెక్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నష్టపోయాయి. రంగాలవారీగా యుటిలిటీస్ 3.11 శాతం, ప్రభుత్వ రంగ బ్యాంకులు 2.63 శాతం, రియల్టీ 2.44 శాతం పెరిగాయి.

ముడిచమురు ధరలు తగ్గినా..

బ్రెంట్ ముడిచమురు ధర 1.18 శాతం తగ్గి బ్యారెల్‌కు 113.96 డాలర్లకు చేరింది. అయినా, అధిక చమురు ధరలు, రూపాయి బలహీనత, భౌగోళిక రాజకీయ అనిశ్చితులు మార్కెట్లకు సవాళ్లేనని నిపుణులు పేర్కొన్నారు. జియో ప్లాట్‌ఫామ్స్ షేర్లు ఒక దశలో 5.12 శాతం పెరిగినా, చివరికి 0.4 శాతం లాభంతో రూ.1,423.05 వద్ద ముగిశాయి. బుధవారం విదేశీ సంస్థాగత మదుపర్లు రూ.871.83 కోట్ల, దేశీయ సంస్థాగత మదుపర్లు రూ.643.35 కోట్ల నికర కొనుగోళ్లు జరిపారు. అమెరికా ఆర్థిక గణాంకాలు, జపాన్ కేంద్ర బ్యాంకు వడ్డీ రేట్ల నిర్ణయంపై మదుపర్లు దృష్టి సారించనున్నారు.

ఐడీబీఐ విక్రయం ఆపాలి

• కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై బ్యాంకు అధికారులు, ఉద్యోగుల వ్యతిరేకత
• పార్లమెంటరీ పర్యవేక్షణలో సమీక్ష చేపట్టాలని డిమాండ్

న్యూఢిల్లీ: ఐడీబీఐ బ్యాంకులో 60.72 శాతం వాటాలను ఫెయిర్‌ఫ్యాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్‌కు విక్రయించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని యునైటెడ్ ఫోరం ఆఫ్ ఐడీబీఐ అధికారులు, ఉద్యోగుల సంఘం వ్యతిరేకించింది. విక్రయ ప్రక్రియను నిలిపివేసి, పార్లమెంటరీ పర్యవేక్షణలో సమగ్ర సమీక్ష చేపట్టాలని డిమాండ్ చేసింది. బ్యాంకు ఆస్తులు, భవిష్యత్తు ఆదాయాలు, వ్యూహాత్మక ప్రాధాన్యాన్ని తక్కువగా అంచనా వేసే ప్రమాదం ఉందని ఫోరం కన్వీనర్ దేవీదాస్ తుల్జాపుర్కర్ తెలిపారు. విక్రయ ధరను నిర్ణయించిన విధానం, ఆస్తుల మదింపు వివరాలను ప్రభుత్వం వెల్లడించాలని, కొనుగోలుదారు సంస్థ ఆర్థిక సామర్థ్యం, యాజమాన్య నిర్మాణాన్ని పారదర్శకంగా పరిశీలించాలని కోరారు. ఐడీబీఐలో ప్రభుత్వ వాటా కనీసం 51 శాతంగా ఉంటుందని


అప్పటి ఆర్థిక మంత్రి జస్వంత్ సింగ్ పార్లమెంటుకు ఇచ్చిన హామీని స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సామాజిక బాధ్యతలు బలహీనపడొద్దు

ప్రైవేటీకరణతో రిజర్వేషన్లు, ఉద్యోగ భద్రత, వెనుకబడిన వర్గాలకు అవకాశాలు, ఆర్థిక సేవలు, అభివృద్ధి రుణాల వంటి సామాజిక బాధ్యతలు బలహీనపడకూడదని ఫోరం పేర్కొంది. బ్యాంకులోని 19,108 మంది ఉద్యోగుల్లో 9,500 మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు చెందినవారు కాగా, 6,911 మంది మహిళలు, 884 మంది దివ్యాంగులు ఉన్నారు. కాగా, ఐడీబీఐలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన 30.48 శాతం, ఎల్ఐసీకి చెందిన 30.24 శాతం వాటాలను కలిపి సుమారు రూ.53,000 కోట్లకు విక్రయించేందుకు కేంద్రం అక్టోబర్ 14న ఆమోదం తెలిపింది. ఫెయిర్‌ఫ్యాక్స్ ఒక్కో షేరుకు రూ.81 చెల్లించనుంది. ఇది స్వతంత్ర మదింపు సంస్థలు నిర్ణయించిన రూ.75.99 న్యాయమైన విలువ కంటే ఎక్కువ. ఆర్‌బీఐ అనుమతులకు లోబడి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా విక్రయం పూర్తయ్యే అవకాశముంది.

ఆదాయం పెరిగినా తప్పని నష్టం

• జులై–సెప్టెంబర్ త్రైమాసికంలో ఇండిగోకు రూ.1,879 కోట్ల నష్టం
• ఇంధన ధరల పెరుగుదలతో టికెట్ ఛార్జీలను పెంచక తప్పడం లేదు
• నిర్వహణ భారాన్ని తట్టుకునే సత్తా ఉంది: సీఈవో వాల్ట్స్



న్యూఢిల్లీ: ఆదాయం పెరిగినా అధిక ఇంధన వ్యయాలు, రూపాయి విలువ క్షీణతతో ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్‌కు నష్టాలు తప్పలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో సంస్థ ఆదాయం గత ఏడాది రూ.19,599.5 కోట్ల నుంచి రూ.24,311.9 కోట్లకు పెరిగినా.. రూ.1,879.1 కోట్ల నష్టాన్ని నమోదు చేసింది. మొత్తం వ్యయాలు రూ.26,188.4 కోట్లకు చేరగా, విమాన ఇంధన ఖర్చు 67.2 శాతం పెరిగి రూ.9,966.8 కోట్లకు చేరింది. పెరుగుతున్న వ్యయాలను తట్టుకునే సామర్థ్యం తమకు ఉందని ఇండిగో సీఈవో విల్లీ వాల్ట్స్ తెలిపారు. సమర్థవంతమైన వ్యయ నిర్వహణ, బలమైన నగదు నిల్వలు అండగా ఉన్నాయని, భారీగా ఖర్చుల కోత విధించే ఆలోచన లేదని చెప్పారు. ఇంధన ధరల పెరుగుదలతో టికెట్ ఛార్జీలను పెంచక తప్పడం లేదని, అయితే ప్రయాణికులపై భారాన్ని సాధ్యమైనంత తగ్గిస్తామని వివరించారు. పశ్చిమాసియా సంక్షోభం, భౌగోళిక రాజకీయ అనిశ్చితులు ఇంధన వ్యయాలను పెంచుతున్నాయని పేర్కొన్నారు.



ఈవీ మార్కెట్‌పై విన్‌ఫాస్ట్ గురి

• తొమ్మిది నెలల్లో 12,877 వాహనాల నమోదు

గురుగ్రామ్: భారత్‌లో విద్యుత్ వాహనాల మార్కెట్‌ను విస్తరించేందుకు వియత్నాం సంస్థ విన్‌ఫాస్ట్ ప్రయత్నిస్తోంది. 2025లో తమిళనాడులో తయారీ కేంద్రాన్ని ప్రారంభించిన సంస్థ.. 2026 జనవరి–సెప్టెంబర్ మధ్య 12,877 వాహనాలను నమోదు చేసింది. సెప్టెంబర్‌లో ఈవీ బ్రాండ్లలో నాలుగో స్థానంలో నిలిచినట్లు సంస్థ ఆసియా విభాగం సీఈవో తపన్ ఘోష్ తెలిపారు. ఏడాది చివరికి 75 డీలర్‌షిప్‌ల లక్ష్యాన్ని ముందుగానే చేరుకున్నట్లు వెల్లడించారు. అర్హత కలిగిన ఛార్జింగ్ కేంద్రాల్లో 2029 మార్చి వరకు ఉచిత ఛార్జింగ్, ఉచిత నిర్వహణ సేవలు, పునర్వినియోగ విలువపై హామీలను అందిస్తోంది. ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల రంగంలోకి విస్తరిస్తూ 50కి పైగా డీలర్లతో ఒప్పందాలు కుదుర్చుకుంది. మరోవైపు, విద్యుత్ వాహనాల ఆధారిత రవాణా సంస్థ గ్రీన్ ఎస్ఎం న్యూఢిల్లీలో కార్యకలాపాలు ప్రారంభించింది.



ఉర్ఫీ జావెద్‌పై సొసైటీ వేధింపులు

విచిత్రమైన దుస్తులు, బోల్డ్ కంటెంట్‌తో తరచూ వార్తల్లో నిలిచే సోషల్ మీడియా సంచలనం ఉర్ఫీ జావెద్ మరోసారి వివాదంలో చిక్కుకుంది. తనపై వచ్చే విమర్శలను పట్టించుకోకుండా విభిన్నమైన ఫ్యాషన్‌తో అభిమానులను ఆకట్టుకునే ఈ భామ.. తాజాగా తాను నివాసముంటున్న హౌసింగ్ సొసైటీ కమిటీపై తీవ్రస్థాయిలో మండిపడింది. సొంత అపార్ట్‌మెంట్‌లో ఉంటూ తన వృత్తికి సంబంధించిన పనులు చేసుకుంటున్న తనను కావాలనే ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించింది. తన ఇంట్లో వీడియోలు, ఇతర కంటెంట్ చిత్రీకరించకూడదంటూ సొసైటీ కమిటీ కొత్త నిబంధనలు తీసుకొచ్చిందని ఆవేదన వ్యక్తం చేసింది. సామాజిక మాధ్యమాల కోసం రూపొందించే వీడియోలను వ్యాపార కార్యకలాపాలుగా పరిగణిస్తూ ఇంట్లో చిత్రీకరణకు అడ్డంకులు సృష్టిస్తున్నారని పేర్కొంది. గతంలో రాత్రివేళ తన ఇంటికి వచ్చే అతిథులపై సొసైటీ ఆంక్షలు విధించడాన్ని వ్యతిరేకిస్తూ ముంబై పోలీసులకు ఫిర్యాదు చేశానని, అప్పటి నుంచి తనపై కక్ష పెంచుకున్నారని ఉర్ఫీ ఆరోపించింది. తనను ఇంటి నుంచి ఖాళీ చేయించాలనే ఉద్దేశంతో ఇంటి యజమాని వద్దకు వెళ్లారని, అయితే ఆయన అందుకు అంగీకరించకపోవడంతో ఇప్పుడు ఇలాంటి నిబంధనలతో వేధిస్తున్నారని మండిపడింది. కొందరు వ్యక్తులు తమ పురుషాధిక్య అహంకారాన్ని సంతృప్తి పరుచుకోవడానికే తనను లక్ష్యంగా చేసుకున్నారని ఘాటుగా వ్యాఖ్యానించింది. అంతేకాకుండా తనను కలవడానికి వచ్చే సందర్శకుల సంచులను సైతం ప్రవేశ ద్వారం వద్ద తనిఖీ చేస్తున్నారని వెల్లడించింది. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో వీడియోలు చిత్రీకరించుకుంటున్నప్పుడు తన విషయంలోనే ఇలాంటి ఆంక్షలు ఎందుకని ప్రశ్నించింది.



మాధురితో డ్యాన్స్ శార్వరి డ్రీమ్ మూమెంట్

బాలీవుడ్ యువ కథానాయిక శార్వరి తన జీవితంలో అత్యంత ప్రత్యేకమైన క్షణాన్ని అభిమానులతో పంచుకున్నారు. ప్రముఖ దర్శకుడు సూరజ్ బర్జాత్యా తెరకెక్కిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'యే ప్రేమ్ మోల్ లియా'లో ఆయుష్మాన్ ఖురానాకు జోడీగా ఆమె నటిస్తున్నారు. తాజాగా ఈ చిత్రంలోని టైటిల్ సాంగ్‌కు తన అభిమాన నటి, ఎవర్‌గ్రీన్ అందాల తార మాధురీ దీక్షిత్‌తో కలిసి శార్వరి నృత్యం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న ఆమె తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. సూరజ్ బర్జాత్యా చిత్రాల్లో నటించి రాజశ్రీ సినిమాలకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన మాధురీ దీక్షిత్ నుంచి ఇంతటి ప్రేమాభిమానాలు పొందడం తనకు గొప్ప గౌరవమని శార్వరి పేర్కొన్నారు. తన ఆరాధ్య నటితో కలిసి నిలబడి నృత్యం చేసే అవకాశం రావడం కల నిజమైనట్లుగా ఉందని, ఇది తన జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోయే అనుభవమని తెలిపారు. 'మీరు నిజంగా అత్యుత్తమం' అంటూ మాధురిపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. గతంలో సూరజ్ బర్జాత్యా దర్శకత్వంలో వచ్చిన 'హమ్ ఆప్కే హై కౌన్' చిత్రంలో మాధురీ దీక్షిత్ తనదైన నటన, నృత్యాలతో ప్రేక్షకులను అలరించారు. ఇప్పుడు అదే రాజశ్రీ సంస్థ తెరకెక్కిస్తున్న చిత్రంలో శార్వరి కథానాయికగా నటిస్తుండటంతో ఈ సినిమాపై ఆసక్తి నెలకొంది.



చిన్నారుల జ్ఞాపకాలతో 'సమ్మర్ హాలిడేస్'

వేసవి సెలవులు, అమ్మమ్మ, తాతయ్యల ఊళ్లు.. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసే కథాంశంతో రూపొందిన చిత్రం 'సమ్మర్ హాలిడేస్'. విజయవంతమైన చిత్రాల నిర్మాత ధీరజ్ మొగిలినేని తన ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టై మెంట్స్ పతాకంపై ఈ సినిమాను నిర్మిస్తున్నారు. శ్రీకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబీ ఖుషి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. నవంబర్ 6న ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది. తాజాగా ఈ చిత్ర ట్రైలర్‌ను వినోదాత్మక చిత్రాల కథానాయకుడు శ్రీవిష్ణు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'సమ్మర్ హాలిడేస్' ట్రైలర్ తనకు ఎంతో నచ్చిందని, దాన్ని చూస్తున్నప్పుడు చిన్నతనంలో వేసవి సెలవులకు ఊరికి వెళ్లిన జ్ఞాపకాలు గుర్తుకొచ్చాయని చెప్పారు. ఈ సినిమాను తప్పకుండా చూస్తానని, దీపావళి సందర్భంగా నవంబర్ 6న కుటుంబ సభ్యులతో కలిసి థియేటర్లలో వీక్షించాలని ప్రేక్షకులను కోరారు. చిన్నారులంతా చక్కగా నటించారని, ఈ యువ బృందాన్ని ప్రేక్షకులు ఆశీర్వదించాలని అన్నారు. మాస్టర్ రోహన్ తనతో కలిసి నటించాడని, సినిమాలపై అతడికి ఎంతో ఆసక్తి ఉందని ప్రశంసించారు. వేసవి సెలవులు రాగానే అమ్మమ్మ, తాతయ్యల ఊళ్లకు వెళ్లే సంప్రదాయం ఇప్పుడు చాలావరకు కనుమరుగైందని, ఈ సినిమా చూస్తే గతంలో వేసవి సెలవులు ఎలా గడిచేవో ప్రేక్షకులకు గుర్తుకొస్తాయని పేర్కొన్నారు. నటి వాసుకిని చూస్తుంటే 'తొలిప్రేమ' చిత్రం గుర్తుకొస్తోందని చెప్పారు. చిన్నారుల కథతో రూపొందిన ఈ సినిమాను ప్రేక్షకులు పెద్ద మనసుతో ఆదరించి విజయవంతం చేయాలని శ్రీవిష్ణు ఆకాంక్షించారు.



'మూకుత్తి అమ్మన్ 2'లో పవర్‌ఫుల్ విలన్‌గా రెజీనా

టాలెంటెడ్ నటి రెజీనా కసాండ్రా త్వరలో 'మూకుత్తి అమ్మన్ 2' చిత్రంతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. 2020లో విడుదలై ఘనవిజయం సాధించిన 'మూకుత్తి అమ్మన్'కు కొనసాగింపుగా తెరకెక్కుతున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రముఖ దర్శకుడు సుందర్ సి దర్శకత్వం వహిస్తుండగా, ఇషారీ కె. గణేష్ నిర్మిస్తున్నారు. లేడీ సూపర్‌స్టార్ నయనతారతో పాటు ఖుష్బూ, స్నేహ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా నవంబర్ 6న థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా నిర్వహించిన ప్రీ–రిలీజ్ వేడుకలో రెజీనా చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. దర్శకుడు సుందర్ సి పనితీరును ఆమె ప్రత్యేకంగా ప్రశంసించారు. తమిళ చిత్ర పరిశ్రమలో మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉన్న ఆయన, ఇతర చిత్ర పరిశ్రమలకు వెళ్లకుండానే తమిళ సినిమాలను పాన్ ఇండియా స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ చిత్రంలో 'భైరవి' అనే శక్తిమంతమైన ప్రతినాయిక పాత్రలో నటించడం సంతోషంగా ఉందని తెలిపారు. తన ఇరవై ఏళ్ల నటనా ప్రయాణంలో ఇంతటి శక్తిమంతమైన ప్రతికూల పాత్రను పోషించడం ఇదే తొలిసారని, ఈ పాత్ర కోసం తన శక్తినంతా ధారపోశానని వెల్లడించారు. నయనతారతో తాను తలపడే సన్నివేశాలు ప్రేక్షకులకు రోమాంచిత అనుభూతిని కలిగిస్తాయని రెజీనా ధీమా వ్యక్తం చేశారు. భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న నిర్మాత ఇషారీ కె. గణేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పూజా కార్యక్రమం నుంచి ప్రీ–రిలీజ్ వేడుక వరకు ప్రతి అంశాన్నీ ఆయన ఘనంగా నిర్వహించారని ప్రశంసించారు. మహిళా ప్రధాన చిత్రాలను ఇంత భారీ స్థాయిలో నిర్మించడం తనలాంటి నటీమణులకు కొత్త ఆశను, ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తుందని అన్నారు. మహిళా ప్రాధాన్య కథలతో సినిమాలు తీసేందుకు ముందుకొస్తున్న నిర్మాతలకు అందరూ మద్దతుగా నిలవాలని రెజీనా కోరారు.

'ఓమ్'లో భిన్నమైన పాత్రల్లో సాయిపల్లవి, శ్రీలీల

కోలీవుడ్ స్టార్ ధనుష్, మాలీవుడ్ లెజెండరీ నటుడు మమ్ముట్టి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న భారీ చిత్రం 'ఓమ్'. 'అమరన్' బ్లాక్‌బస్టర్‌తో గుర్తింపు తెచ్చుకున్న ప్రతిభావంతుడైన దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాలో సాయిపల్లవి, శ్రీలీల, నసీరుద్దీన్ షా కీలక పాత్రలు పోషిస్తున్నారు. యువ సంగీత సంచలనం సాయి అభ్యంకర్ స్వరాలు సమకూరుస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా నవంబర్ 20, 2026న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి సినిమా విశేషాలను వెల్లడించారు. 'ఓమ్'లో సాయిపల్లవి, శ్రీలీల పూర్తిగా భిన్నమైన పాత్రల్లో కనిపిస్తారని తెలిపారు. తమకు అలవాటైన నటనాశైలికి, కంఫర్ట్ జోన్‌కు దూరంగా వెళ్లి ఈ చిత్రంలో ఇద్దరూ కొత్తగా కనిపిస్తారని ప్రశంసించారు. సాధారణంగా కథ రాసేటప్పుడు తన మనసులో నటీనటులను ఊహించుకోనని, అయితే 'ఓమ్' కథ పూర్తయ్యాక మాత్రం సాయిపల్లవి, శ్రీలీల పేర్లే తనకు గుర్తుకొచ్చాయని చెప్పారు. తమ పాత్రలను సహజంగా, వాస్తవికంగా తెరపై ఆవిష్కరించేందుకు కథానాయికలు ప్రత్యేక శిక్షణ శిబిరాల్లో పాల్గొన్నారని వెల్లడించారు. సినిమా నేపథ్యాన్ని లోతుగా అర్థం చేసుకునేందుకు సంబంధిత ప్రాంతాల్లోని నిజ జీవిత వ్యక్తులను కలిసి, వారి అనుభవాలను తెలుసుకుంటూ ఎంతో శ్రమించారని రాజ్‌కుమార్ పెరియసామి వివరించారు.

క్రేజీ కాన్సెప్ట్‌తో 'హై'.. నవంబర్ 27న విడుదల

టాలీవుడ్‌లో విభిన్న కథాంశాలతో తెరకెక్కుతున్న చిన్న సినిమాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ క్రమంలో సరికొత్త కథాంశంతో రూపొందిన 'హై' చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. ఎస్.కృష్ణ దర్శకత్వం వహిస్తూ, ప్రధాన పాత్రలో నటించడంతోపాటు నిర్మాతగానూ వ్యవహరిస్తున్నారు. అనన్య శర్మ, పల్లవి డోరా, సాయికృష్ణ, రేవంత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైరా ప్రజెంట్స్, ఇమేజ్ స్పార్క్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై ఎస్.కృష్ణ, హరీష్ పెద్ది, శేఖర్ దివ్వెల ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మించారు. మనిషికి నిజమైన 'హై' లేదా కిక్ ఇచ్చే అంశాలేమిటనే ఆసక్తికరమైన ప్రశ్నతో ఈ సినిమా కథ సాగుతుంది. డబ్బు, మద్యం వెనుక పరుగులు తీసే మనుషుల మనస్తత్వాలు, ప్రేమికుడి ప్రమాదకరమైన బెట్టింగ్‌లు, ఆత్మగౌరవం కోసం పోరాడే ఓ శక్తిమంతమైన యువతి కథ.. ఇలా మూడు విభిన్న కోణాలను కలిపి దర్శకుడు ఆసక్తికరంగా తెరకెక్కించారు. మనుషులు తీసుకునే నిర్ణయాలు, వారి భావోద్వేగాల ఆధారంగా ప్రతి పాత్రను కొత్తగా తీర్చిదిద్దారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా నవంబర్ 27న చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రత్యేక పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. 'ఎక్కడా చూడని కిక్కిచ్చే వినోదంతో, గందరగోళం నిండిన ఉత్సాహానికి సిద్ధం అవ్వండి' అంటూ చిత్ర బృందం ఇచ్చిన సందేశం సినిమాపై అంచనాలను పెంచుతోంది.



మళ్లీ వెండితెరపై దివ్యవాణి సందడి

కష్టకాలంలో అండగా నిలిచాడు

వెండితెరపై 'బాపు బొమ్మ'గా, బుల్లితెరపై 'పుత్తడిబొమ్మ'గా ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న నటి దివ్యవాణి (కె. దివ్యవాణి చౌదరి) మరోసారి సినిమాలపై దృష్టి సారించేందుకు సిద్ధమవుతున్నారు. నటిగా తనదైన ముద్ర వేసిన ఆమె.. రాజకీయాల్లోనూ చురుకుగా వ్యవహరించి గుర్తింపు తెచ్చుకున్నారు. మరోవైపు 'సమాజానికి తిరిగి ఇవ్వాలి' అనే నినాదంతో పలు సేవా కార్యక్రమాలు చేపడుతూ తనవంతు బాధ్యతను నిర్వర్తిస్తున్నారు. ఇకపై మరింత ఉత్సాహంతో సినీ రంగంలో కొనసాగాలని దృఢంగా నిర్ణయించుకున్నట్లు దివ్యవాణి చెబుతున్నారు. 'పెళ్లి పుస్తకం', 'ఎదురింటి మొగుడు–పక్కింటి పెళ్లాం' వంటి గుర్తుండిపోయే చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న ఆమె.. 'పుత్తడిబొమ్మ' ధారావాహికతో బుల్లితెర ప్రేక్షకులనూ ఆకట్టుకున్నారు. తెలుగు చిత్రాలతో పాటు కన్నడ సినిమాల్లోనూ నటించి అక్కడి ప్రేక్షకులకు సుపరిచితురాలయ్యారు. కన్నడ భాషను అనర్గళంగా మాట్లాడగలగడం ఆమెకు మరో ప్రత్యేకత. ప్రస్తుతం బహుభాషా చిత్రాల హవా కొనసాగుతున్న నేపథ్యంలో రెండు, మూడు భాషల్లో ప్రేక్షకులకు చేరువైన నటీనటులకు చిత్ర పరిశ్రమలో మంచి అవకాశాలు లభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో దివ్యవాణి మళ్లీ వెండితెరపైకి రావాలనే నిర్ణయం తీసుకోవడం ఆసక్తికరంగా మారింది. ఆమెకు మంచి పాత్రలు, ప్రతిష్ఠాత్మక చిత్రాల్లో అవకాశాలు రావాలని అభిమానులు, నెటిజన్లు ఆకాంక్షిస్తున్నారు. సమాజ సేవను కొనసాగిస్తూనే నటిగా మరోసారి తన సత్తా చాటాలని దివ్యవాణి చేస్తున్న ప్రయత్నాలు ఎలాంటి ఫలితాలను అందిస్తాయో చూడాలి.



బాలీవుడ్ కథానాయిక జాన్వీ కపూర్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకుంది. ముఖ్యంగా శిఖర్ పహారియాతో తనకున్న అనుబంధం గురించి మాట్లాడుతూ భావోద్వేగానికి గురైంది. ప్రముఖ టాక్ షో 'కాఫీ విత్ కరణ్'లో పాల్గొన్న ఆమె.. తన జీవితంలో అత్యంత కఠినమైన సమయంలో శిఖర్ తనకు అండగా నిలిచిన తీరును గుర్తు చేసుకుంది. 2018లో తన తల్లి, అతిలోక సుందరి శ్రీదేవి హఠాన్మరణం చెందినప్పుడు కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయిందని తెలిపింది. ఆ సమయంలో తాము ఎదుర్కొన్న పరిస్థితులు ఎంతో బాధాకరమైనవని గుర్తు చేసుకుంది. అప్పట్లో లండన్‌లో చదువుకుంటున్న శిఖర్ పహారియా.. తన పరిస్థితిని తెలుసుకుని చదువును మధ్యలోనే ఆపేసి ముంబైకి వచ్చాడని జాన్వీ వెల్లడించింది. తాను ఎప్పుడు ఏ అవసరంలో ఉంటానో, ఎప్పుడు ఒంటరిగా మిగిలిపోతానోనని ఆందోళన చెందుతూ.. జుహూలోని తన స్నేహితుడి ఇంట్లో దాదాపు నెల రోజులపాటు ఉన్నాడనే విషయం తనకు చాలా కాలం తర్వాత తెలిసిందని చెప్పింది. ఆ క్లిష్ట సమయంలో తనకు అండగా నిలవాలనే ఉద్దేశంతో శిఖర్ చేసిన పనిని తెలుసుకుని ఎంతో భావోద్వేగానికి గురైనట్లు తెలిపింది. తన జీవితంలో శిఖర్ పాత్ర ఎంత ముఖ్యమైనదో ఈ సంఘటన తెలియజేస్తుందని ఆమె వ్యాఖ్యలను బట్టి అర్థమవుతోంది. ఇదే సందర్భంలో తల్లి శ్రీదేవిని కోల్పోయిన సమయంలో తన చెల్లెలు ఖుషీ కపూర్ తనకు ధైర్యం చెప్పిన తీరును కూడా జాన్వీ గుర్తు చేసుకుంది. తాను తీవ్రంగా బాధపడుతున్న సమయంలో ఖుషీ తన ఏడుపును ఆపుకుని తనను ఓదార్చిందని, ఆ పరిస్థితుల్లో చెల్లెలు చూపిన ధైర్యం తనకు ఎంతో అండగా నిలిచిందని తెలిపింది. తల్లిని కోల్పోయిన బాధను భరిస్తూనే ఒకరికొకరు తోడుగా నిలిచిన ఆ రోజులను గుర్తు చేసుకోవడం తనను భావోద్వేగానికి గురిచేసిందని చెప్పింది. మరోవైపు జాన్వీ కపూర్, శిఖర్ పహారియా గత కొన్నేళ్లుగా ప్రేమలో ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నప్పటికీ, తమ బంధం గురించి వారు అధికారికంగా పెద్దగా ప్రకటించలేదు. అయినప్పటికీ పలు సందర్భాల్లో శిఖర్ తన జీవితంలో ప్రత్యేకమైన వ్యక్తి అని జాన్వీ చెప్పుకొచ్చింది. తాజాగా ఆమె చేసిన వ్యాఖ్యలు మరో సారి చర్చకు దారితీశాయి. ఇక సినిమాల విషయానికి వస్తే.. జాన్వీ ప్రస్తుతం తెలుగు, హిందీ చిత్రాలతో బిజీగా ఉంది. టైగర్ ష్రాఫ్, లక్ష్యతో కలిసి 'లగ్ జాగలే'లో కనిపించనుంది. ఈ చిత్రం 2027 మే 14న ప్రేక్షకుల ముందుకు రానుంది.

Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.